
ఆధునిక తెలుగు సాహిత్యంలో
హాస్యం

(వివిధ ప్రక్రియల సన్నివేశాల నాటకీకరణ)



ఆంధ్ర సారస్వత పరిషత్తు
హైదరాబాదు

ఆధునిక తెలుగు సాహిత్యంలో
హాస్యం

(వివిధ ప్రక్రియల సన్నివేశాల నాటకీకరణ)

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంకలన కర్త

సి.ఎస్. రావు

ప్రచురణ :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాద్ – 500 001

ఫోన్: 040-24753724

Adhunika Telugu Sahityamlo Haasyam

ప్రథమ ముద్రణ : 2007

ప్రతులు : 1000

మూల్యం : రూ. 60/-

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్: +91-40-24753724

ముద్రణ :
విప్ల కంప్యూటర్ సర్వీసెస్
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్: +91-40-27654003, 27676910

విషయసూచిక

అవతారిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా. సి. నారాయణ రెడ్డి
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ లోకనంది శంకరనారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీసంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు కీ.శే. డా. దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవితం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నది. వీటిలో భాషా బోధన, గ్రంథ ప్రచురణ ముఖ్యభూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాల, స్నాతకోత్తరస్థాయి ప్రాచ్య కళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీ సభలు,

సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి విలక్షణతను సంతరించుకున్నాయి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. ఇంతవరకు 200పైగా గ్రంథాలు వెలువరించింది.

అత్యంత ప్రధాన సాహిత్యాంశాలపై అగ్రశ్రేణి కవి పండితుల ప్రసంగాలు ఏర్పాటు చేసి, ఆ ప్రసంగ పాఠాలను గ్రంథరూపంలో ప్రచురించడం పరిషత్తు ఒక సంప్రదాయంగా పాటిస్తున్నది.

సాహిత్య సాంస్కృతికాంశాలను మేళవించి విలక్షణ కార్యక్రమాలకు రూపకల్పన చేసే ప్రక్రియకు ఆంధ్ర సారస్వత పరిషత్తు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాలు అందరి మన్ననలందుకుంటున్నాయి. ఈ పరంపరలోనిదే "ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం (ప్రసంగాత్మక ప్రదర్శనలు)" అనే కార్యక్రమం. తెలుగు సాహిత్యం అన్ని ప్రక్రియలలోను హాస్యాన్ని పుష్కలంగా పండిస్తున్నది. వివిధ సాహితీ ప్రక్రియలలోని రసవద్ఘట్టాలను నాటకీకరించి వాటిని రంగస్థలంపై ప్రదర్శించినపుడు ప్రేక్షకుల స్పందన పరిషత్తును విశేషంగా ఆహ్లాదపరిచింది. కాళ్ళకూరి నారాయణరావు గారి "వరవిక్రయం" (నాటకం), పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి "సాక్షి" (వ్యాసం), చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి "గణపతి" (నవల), మునిమాణిక్యం నరసింహారావుగారి "కాంతం కథలు" (కథ), సురవరం ప్రతాపరెడ్డి గారి "మొగలాయి కథలు" (కథ) నుంచి హాస్య సన్నివేశాలు ఆధారంగా పరిషత్తు 2007 ఫిబ్రవరి 21, 22 తేదీలలో ప్రసంగాత్మక ప్రదర్శనలను ఏర్పాటు చేసింది. నాటకీకరణలో ప్రముఖ రచయిత శ్రీ సి.ఎస్.రావు, ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి సహకరించారు. ప్రదర్శనలకు ప్రముఖ ప్రయోక్త, దర్శకుడు శ్రీ దీక్షిత్ డి.ఎస్. దర్శకత్వబాధ్యత వహించారు. నాటక భాగాలతోపాటు, వ్యాసం, నవల, కథా ప్రక్రియల నాటకీకృత సన్నివేశాలను సంకలనం చేసి ఈ గ్రంథ రూపంలో అందిస్తున్నాం. ఎప్పటిలాగే సాహితీలోకం ఈ ప్రచురణను ఆదరిస్తుందని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు
11-11- 2007

డా. సి. నారాయణ రెడ్డి

ముందుమాట

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు తరచుగా నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలు చాలా మంది ఆదరణకు నోచుకోవడం సంతృప్తి కలిగిస్తున్నది. క్షుణ్ణమైన రీతిలో కాకుండా విభిన్నమైన పద్ధతిలో విశిష్టమైన కార్యక్రమాలు రూపొందటానికి కారకులు, ప్రేరకులు మా సంస్థ అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి గారు. ఆ కార్యక్రమాలలో ఒకటి ఈ గ్రంథంగా రూపొందిన "ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం" సదస్సు. నాటకం, వ్యాసం, కథ, నవల మొదలైన ప్రక్రియల నుంచి కొన్ని సన్నివేశాలను తీసుకొని వాటిని నాటకీకరించి అభినయింప జేయటం ఇందులోని వైశిష్ట్యం. సాహితీ రసికులు సొంతం నాటకాన్ని గాని నవలనుగాని చదివే సమయం లేనప్పుడు వాటిలోని ప్రధాన సన్నివేశాల్ని అభినయసుందరంగా ఈ ప్రదర్శనల ద్వారా చూడవచ్చు. నాటకాల్ని, వ్యాసాల్ని, కథల్ని, నవలల్ని ఇలా రూపొందించి నాటకీకరించటం వినూత్నమైన ప్రయోగం. వీటిని మా అధ్యక్షులు 'వివిధ ప్రక్రియల సన్నివేశాల నాటకీకరణ' అని

అభివర్ణించారు. ఇలాంటి ప్రయోగాన్ని భవిష్యత్తులో అనేకులు అనుసరించడం జరుగుతుందని మా విశ్వాసం. వీటిని దూరదర్శన్ రెండు భాగాలుగా ప్రసారం చేసింది. దూరదర్శన్ డైరెక్టర్ డా. పి. మధుసూదనరావుగారికి మా ధన్యవాదాలు.

ఈ కార్యక్రమ నిర్వహణలోను, వాటిని గ్రంథంగా రూపొందించటంలోను పరిషత్తుకు సహకార హస్తాలు అందించారు శ్రీ సి.ఎస్.రావుగారు, శ్రీ డి.ఎస్. దీక్షిత్ గారు. ప్రధానంగా బాధ్యతను తీసుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు ప్రముఖ రచయిత శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారు. వారి వెంట ఉండి, కార్యాలయ వ్యవహారాలు చూసుకొన్నవారు, మా పరిపాలనాధికారి శ్రీ పాండురంగయ్యగారు. అందరికీ కృతజ్ఞతలు.

హైదరాబాదు

11-11-2007

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

మనవి

సి. ఎస్. రావు
సంకలన కర్త

ఆధునిక సాహిత్యాన్నైనా, ప్రాచీన సాహిత్యాన్నయినా అభిలాష గలవారు చదువుకొని ఆనందించవచ్చును. చదివే వోపిక లేనివారు, అసలు చదువు రానివారు ఎవరేనా చదివితే విని ఆనందించవచ్చును. ఈ పని కొంతవరకు 'నవలా పఠనం', 'కథా పఠనం' ప్రసార కార్యక్రమాల్లో ఆకాశవాణి చేస్తూ వచ్చింది. కథలనూ, నవలలనూ శ్రవ్యనాటకాలుగా మలచి కూడా ఆకాశవాణి ప్రసారాలు చేసింది.

కథను నాటికలుగా చేయించి 'కథానాటికలపోటీలు' నిర్వహించి, ఆధునిక కథా సాహిత్యంలోని కొన్ని మంచి కథలను నాటికలుగా ప్రదర్శించే అవకాశం కల్పించింది అజోవిభో పరిషత్తు.

నిజానికి ఆధునిక సాహిత్యాన్ని చదవలేనివారూ, చదివే అలవాటు లేనివారు కూడా పూర్తిగా ఆస్వాదించడానికి, ఆకళింపు చేసుకోవడానికి ప్రసంగాత్మక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ సత్యం ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన 'ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం' కార్యక్రమంలో ప్రదర్శించిన ప్రసంగాత్మక ప్రదర్శనలలో రుజువయింది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వివిధ సాహితీ కార్యక్రమాలను దశాబ్దాలుగా నిర్వహిస్తూ వుందన్న సంగతి సాహితీవేత్తలకు, సాహితీ ప్రియులకు తెలిసిన విషయమే.

2007 ఫిబ్రవరి 21, 22 తేదీలలో ఒక వినూత్న కార్యక్రమాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించింది. ఆ వినూత్న కార్యక్రమమే "ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం" అనే శీర్షికన నిర్వహించిన ప్రసంగాత్మక ప్రదర్శనలు. ఆధునిక తెలుగు సాహిత్యంలోని సుప్రసిద్ధమైన నాటకం, కథ, నవల, వ్యాసం మొదలైన సాహితీ ప్రక్రియలలోని కొన్ని ఆణిముత్యాలను రంగస్థల ప్రదర్శనల ద్వారా పరిచయం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. నాటకం ఎలాగూ ప్రదర్శనయోగ్యమే. కారణం, నాటకం ముఖ్యంగా ప్రదర్శన కోసమే రచించబడుతుంది కనుక. కాని, కథ, నవల, వ్యాసంల నుంచి ప్రదర్శనలు కావాలంటే కొంత శ్రమతో కూడుకున్న పనే. కథను, నవలను, వ్యాసాన్ని నాటకంగా మలచాలంటే, మలచిన తరువాత ప్రదర్శించాలంటే అది రచయితకూ, దర్శకునకూ కూడా ఒక సవాలే.

'ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం' అనే శీర్షికన జరిగిన ప్రసంగాత్మక ప్రదర్శనలలో మొదటి రోజున అంటే ఫిబ్రవరి 21న, "వరవిక్రయం" అనే సాంఘిక పద్యనాటకంలోని ఒక సన్నివేశాన్ని ప్రదర్శించడం జరిగింది. ఆ రోజున వరవిక్రయం నాటకం గురించి నాటక– సినీ రచయిత శ్రీ ఆదివిష్ణు మాట్లాడారు. ఆ నాటక రచయిత శ్రీ కాళ్ళకూరి నారాయణరావుగారి గురించి, వారి ప్రతిభాపాటవాలు గురించి శ్రీ ఆదివిష్ణు ఎంతో ఆసక్తికరంగా వివరించారు. 'వరవిక్రయం' ఒక హాస్యభరితమైన ప్రయోజనాత్మక నాటకం. ఈనాటి వరకట్న సమస్యను ఎత్తి చూపడమే కాకుండా నిరసిస్తూ రచింపబడిన నాటకమన్నారు శ్రీ ఆదివిష్ణు. ఈ ప్రదర్శనకు శ్రీ డి.ఎస్. దీక్షిత్ దర్శకత్వం వహించారు. శ్రీ దీక్షిత్ అభినయ అధ్యాపకులు, నటులు, దర్శకులు కూడా కావడంతో ప్రదర్శన బాగా రక్తి కట్టింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న నటీనటవర్గం ఎంతో సమర్థంగా నటించి ప్రేక్షకుల మన్ననలను పొందగలిగారు.

రెండవ ప్రదర్శన శ్రీ గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కం' నాటకం నుంచి సన్నివేశం. కన్యాశుల్కం నాటకం గురించి, ఆ నాటక రచయిత శ్రీ గురజాడ అప్పారావుగారి గురించి నాటక రచయిత, నటులు, చిత్ర దర్శకులు అయిన శ్రీ తనికెళ్ళభరణిగారు ప్రసంగించారు. వారి ప్రసంగంలో కన్యాశుల్కం ఎంత గొప్ప నాటకమో వివరిస్తూ ఆ నాటక రచయిత తెలుగువాడు కావడం మన జాతి అదృష్టం అన్నారు. నాటకంలో

వ్యావహారిక భాషకు శ్రీకారం చుట్టిన ఘనత శ్రీ గురజాడ వారికే దక్కుతుంది అన్నారు. ఏయే సమాజాలు ఈ నాటకాన్ని ఆంధ్రదేశమంతటా ప్రదర్శించాయో వివరించడమే కాకుండా ఈ నాటకం యితర భాషల్లోకి అనువదింపబడిన విషయం కూడా వివరించారు. కన్యాశుల్కం నాటకంలోని ఈ సన్నివేశం కూడా నటీనటుల ప్రతిభతోటి, దర్శకుల సామర్థ్యంతోటి, అసలు వస్తువులో గల సత్తాతోటి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది, నవ్వించింది.

ఈ రెండు ప్రదర్శనలూ నాటకాలలో వున్న సన్నివేశాలే. అయితే శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి 'సాక్షి' వ్యాసాల నుంచి ఒక వ్యాసాన్ని తీసుకుని నాటకీకరించడం జరిగింది. వ్యాసాన్ని నాటకీకరించి ప్రదర్శించడం నిజంగా ఒక సమస్యే. నాటక రంగంలోనే యిది తొలిప్రయత్నం అని నేను అనుకుంటాను.

శ్రీ పానుగంటి వారి సాక్షి వ్యాసాల గురించి డా॥ ద్వా.నా.శాస్త్రి గారు ప్రసంగించారు. 'సాక్షి' వ్యాసాలు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు రెండు దశాబ్దాలలో అప్పుడప్పుడు రచించినవే, ఆనాటి వివిధ సాహితీ పత్రికలలో ప్రచురింపబడినవే అని వివరిస్తూ ఈ వ్యాసాలలోని పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు ఆనాటి మన తెలుగు జనజీవన శైలిని ప్రతిబింబించాయని అన్నారు డా॥ ద్వా.నా.శాస్త్రి. ఆ రోజులలో ఈ వ్యాసాలను చదివిన సాహితీ ప్రియులు, చదవగా వినిన శ్రోతలు, ఎవరికి వారే భుజాలు తడుముకునే వారు అన్నారాయన. వ్యంగ్యరచనకు శ్రీ పానుగంటి వారి సాక్షి వ్యాసాలు తెలుగు సాహిత్యంలో ఒక ప్రామాణిక రచన అని కొనియాడారు డా. శాస్త్రిగారు. ఈ వ్యాసాన్ని నాటకీకరించినది, దర్శకత్వం వహించినది శ్రీ డి.ఎస్. దీక్షిత్. ఉద్దండులైన నటుల సహకారంతో దర్శకుని ప్రతిభతో ఈ ప్రదర్శన కూడా ఎంతగానో ప్రేక్షకాదరణ పొందింది.

రెండవరోజు సదస్సులో అంటే ఫిబ్రవరి 22న సాయంత్రం జరిగిన సదస్సులో మూడు ప్రసంగాత్మక ప్రదర్శనలు జరిగాయి. మొదట శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహంగారి "గణపతి" నవల నుంచి ఒక సన్నివేశాన్ని తీసుకుని, నాటకీకరించి ప్రదర్శించడం జరిగింది. ఈ నవలలోని ఒక సన్నివేశాన్ని నేనే నాటకీకరించాను. గణపతి నవల తెలుగు సాహిత్యంలో తొలి హాస్యనవలగా ప్రాచుర్యం పొందింది. ఆ తరువాత శ్రవ్య నాటకంగా విజయవాడ ఆల్ ఇండియా రేడియో నుంచి ప్రసారమై ఎంతో జనాదరణను పొందింది. ఆ తరువాత దూరదర్శన్ హైదరాబాదు ద్వారా ధారావాహిక ప్రాయోజిత కార్యక్రమంగా పదమూడు వారాలపాటు ప్రసారమై ప్రేక్షకులను నవ్వించింది, అలరించింది. కానీ ఈ నవలలోని

ఒక సన్నివేశం నాటకీకరించి ప్రదర్శించడం యిదే మొదటిసారి. ఈ అవకాశం నాకు దక్కడం ఒక అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాజమండ్రిలో పుట్టి, అక్కడే పెరిగి, అక్కడే పెద్దయిన నవలా రచయిత అయితే, నేనూ అదే ప్రాంతంలో పుట్టి, రాజమండ్రిలో చదువుకొని, రచన ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో స్థిరపడి, నాటక రచయితనై, శ్రీ చిలకమర్తి వారి తొలి తెలుగు హాస్యనవలను దూరదర్శన్‌కు దృశ్యకావ్యంగా మలచడం, ఆంధ్ర సారస్వత పరిషత్తు తలపెట్టిన ప్రసంగాత్మక ప్రదర్శనలలో ప్రదర్శనకుగాను నాటకీకరించడం ఒక అదృష్టమే కదా! శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గురించి, వారి నవల 'గణపతి' గురించి, సంక్షిప్తంగా ప్రేక్షకులకు వివరించే అవకాశం కలగడం నాకెంతో ఆనందంగా వుంది. ఈ ప్రదర్శనకు కూడా దర్శకులు శ్రీ డి.ఎస్. దీక్షిత్ గారే. నటీనటులు కూడా చాలామంది టి.వి. సీరియల్‌లో నటించిన ఉద్దండులే.

రెండవరోజు సదస్సులో, రెండవ ప్రదర్శనగా శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారి "కాంతం కథలు" నుంచి ఒకకథ "పర్‌ఫెక్ట్ వైఫ్" ను నాటకీకరించి ప్రదర్శించటం జరిగింది. ఈ కథను నాటకీకరించినదీ నేనే. శ్రీ మునిమాణిక్యం గారి గురించీ, ఆయన వ్రాసిన కాంతం కథల గురించి సంక్షిప్తంగా ప్రసంగించినదీ కూడా నేనే. ఈ మునిమాణిక్యం గారు నాలాగే అధ్యాపకులు. "కాంతం కథలు వ్రాస్తే, శ్రీ మునిమాణిక్యం గారే వ్రాయాలి. శ్రీ మునిమాణిక్యంగారు వ్రాస్తే కాంతం కథలనే వ్రాయాలి", అనే వారట వారి కాలంలోని సాహితీప్రియులు. శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారి కాంతం కథలు, మధ్యతరగతి జీవితంలోని భార్యాభర్తల మధ్య సాగే శృంగార, హాస్య, పవిత్ర ప్రణయ సంఘటనలతో నిండి ఉంటాయి. ఆ రోజులలో చిన్నతనంలోనే పెళ్ళి, పెళ్ళైన కొంత కాలానికి అమ్మాయి పెద్దమనిషి అయ్యాక, తొలిరాత్రికి ముందు కొన్నాళ్ళు ఆ అబ్బాయీ, అమ్మాయీ ఒకరినొకరు చూసుకుందుకు, పలకరించుకుందుకు పడే తాపత్రయం, అమ్మాయి పడే భయం, శ్రీ మునిమాణిక్యంగారు ఒక కథలో ఎంతో చక్కగా వ్రాశారు. ఆ అమ్మాయే కాంతం అని కథ చివరి దాకా చెప్పలేదు. కథ చివర చెప్పారు. ఆ స్థాయి నుంచే ప్రారంభమైన దాంపత్యం ఎదిగి, మహావృక్షంలా విస్తరించేదాకా కాంతం పాత్ర ఎన్నో పరిణామాలు చెందుతుంది. దాంపత్యంలోని తొలిరోజులలో, ఆ తరువాత తల్లి కాబోయే ముందు, తల్లి అయ్యాక, పిల్లలను పెంచే తల్లిగా, భర్తను ఆదరించే భార్యగా, ఒక ఉత్తమ గృహిణిగా, యిరుగు పొరుగు వారితో ఎంతో సన్నిహితురాలిగా కాంతాన్ని వివరిస్తూ, కాంతం మరణం దాకా ఈయన కథలు సాగడమే కాకుండా, కాంతం మరణించాక

కూడా, ఆ కాంతం ఆ యింట్లో ఎలా నిలుస్తుందో, ఎలా వెలుస్తుందో వివరించారు. ఆ కథలలోని ఒక కథ "పర్‌ఫెక్ట్ వైఫ్". ఈ పర్‌ఫెక్ట్ వైఫ్ కథా నాటికకు కూడా శ్రీ దీక్షిత్ గారే దర్శకత్వం వహించారు. అనుభవజ్ఞులైన నటులు నటించారు. ప్రదర్శన ప్రేక్షకుల మన్ననలను పొందగలిగింది.

రెండవరోజు సదస్సులో ఆఖరి కార్యక్రమం, సదస్సు మొత్తంలోని ఆరవ కార్యక్రమం శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి "మొగలాయి కథలు" నుంచి ఒక కథను తీసుకుని ప్రసంగాత్మక ప్రదర్శనగా ప్రదర్శించడం. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి గురించి ఆచార్య జి. చెన్నకేశవరెడ్డిగారు ప్రసంగించారు. శ్రీ ప్రతాపరెడ్డిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. భాషా సాహిత్య సామాజిక రంగాలలో ఆనాడు ఎనలేని కృషి చేసి తెలంగాణను మేలుకొలిపిన వైతాళికుడు అన్నారు ఆచార్య చెన్నకేశవరెడ్డిగారు. శ్రీ ప్రతాపరెడ్డిగారు "ఆంధ్రుల సాంఘిక చరిత్ర", "రామాయణ విశేషాలు", "హిందువుల పండుగలు", మొ॥ పరిశోధనాత్మక గ్రంథాలు రచించడమే కాకుండా "గోల్కొండ పత్రిక" సంపాదకులు కూడా. సృజనాత్మక ప్రక్రియలలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. నాటకాలు, కవిత్వం, నవలలు, వందలకొలదీ వ్యాసాలు, ఎన్నో సంపాదకీయాలు వ్రాయడమే కాకుండా తెలంగాణ తొలి కథకులలో ఒక ప్రముఖ కథకులుకూడా. వారి కథల సంకలనం పేరే "మొగలాయి కథలు". ఆ కథల నుంచే ఒక కథను తీసుకుని నాటకీకరించి, ఈ సదస్సులో ప్రదర్శించడం జరిగింది. ఈ నాటిక మొత్తం తెలంగాణ మాండలికంలో సాగుతుంది అని వివరించారు డా॥ జి. చెన్నకేశవరెడ్డిగారు.

"గ్యారాకద్దు-బారాకొత్వాల్" అనే కథను ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి నాటకీకరించగా, శ్రీ డి. ఎస్. దీక్షిత్ దర్శకత్వం వహించారు. ఈ ప్రదర్శన కూడా ఎంతో ఆసక్తికరంగా ప్రేక్షకులని నవ్విస్తూ సాగింది.

ఈ రెండురోజులు సాగిన సదస్సులకు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డిగారు అధ్యక్షత వహించారు. అధ్యక్షులు అధ్యక్షోపన్యాసంలో తెలుగు సాహిత్యంలో హాస్యం గురించి ప్రసంగాత్మక ప్రదర్శనల గురించి వివరించారు. వాటి అవసరాన్ని విశదీకరించారు. మొదటిరోజు సదస్సులో వీరితోబాటు రఘుపతి వెంకయ్య అవార్డ్ గ్రహీత, ప్రముఖ చలనచిత్ర జానపద కథానాయకుడు శ్రీ టి.యల్. కాంతారావు గారు పాల్గొన్నారు. వారి చిన్నతనంలో వారూ రంగస్థల నటులే కావటం విశేషం. మొదటి రోజు సదస్సులో వీరితో బాటు శ్రీ ఆదివిష్ణుగారు, శ్రీ తనికెళ్ల భరణి గారు, డా॥ శ్రీ ద్వా.నా. శాస్త్రిగారు ప్రసంగించారు.

రెండవరోజు కార్యక్రమంలో సభా ప్రారంభకులుగా రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత, నాటక, సాహితీప్రియులు డా॥ గుమ్మడి వెంకటేశ్వరరావు గారు నాటకాలు సినిమాలకు ప్రేరణ కావాలని, సినిమాలలో ఉండే అశ్లీలత, హింస లాంటివి నాటకాలలో ఉండవని, సామాజిక జీవితాన్ని నిజంగా ప్రతిబింబించేవి నాటకాలేనని వివరించారు. ఆనాటి ప్రదర్శనాంశాలను గురించి శ్రీ సి.ఎస్.రావుగారు, శ్రీ దీక్షిత్‌గారు, ఆచార్య జి. చెన్నకేశవరెడ్డిగారు వివరించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధానకార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు ఈ కార్యక్రమాలు రూపుదిద్దుకోవడానికి తమ సిబ్బందితో అన్ని విధాల సహకరించడమే కాకుండా, ఈ రెండు సదస్సులకూ వేదిక పైకి అతిథులను ఆహ్వానించే బాధ్యతకూడా వారే వహించడం ఒక విశేషం.

ఈ కార్యక్రమాల సమన్వయకర్తగా డా॥ సి. వసుంధరగారు ఎంతో సమర్థంగా కార్యక్రమాల గురించి వివరించారు. వారి వివరణలు హాస్యరసభరితం కావడం ఈ సదస్సులలో మరో ప్రత్యేకత.

అయితే ఈ కార్యక్రమం మొత్తం రూపుదిద్దుకోవడానికి, సజావుగా కొనసాగడానికి, విజయవంతం కావడానికి కారకులు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా॥ సి. నారాయణ రెడ్డి గారేనని తెలిసిన విషయమే. ఈ కార్యక్రమాలన్నిటినీ సమన్వయపరచ టానికి శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారి నిరంతర కృషి, ఆంధ్ర సారస్వత పరిషత్తు సిబ్బంది సహకారం ప్రశంసనీయం. ఈ ప్రదర్శనలోని నటీనటుల గురించి సాంకేతిక నిపుణుల గురించి నేను ప్రత్యేకంగా వివరించకపోవడానికి కారణం ప్రతి ప్రదర్శన తాలూకు ఫోటోలతోపాటు వీరందరి పేర్లూ ప్రచురింపబడడమే.

శుద్ధప్రతి సిద్ధం చెయ్యడంతో సహకరించిన తేజోమూర్తులు మురళీధర్, కుమారి ఎస్. అమృత, ధన్‌రాజ్‌లకు, ప్రదర్శనలన్నింటికీ సమన్వయకులుగా వ్యవహరించిన కోలా శ్రీనివాస్, దీవి శ్రీధర్ దీక్షిత్‌లకు కృతజ్ఞతలు.

హైదరాబాదు

11-11- 2007 సి.ఎస్. రావు

వరవిక్రయం

(నాటకం)



రచన: శ్రీ కాళ్ళకూరి నారాయణరావు

దర్శకత్వం: శ్రీ దీక్షిత్ డి.ఎస్.


నటీనటులు :

పుణ్యామూర్తుల పురుషోత్తమరావు	-	శ్రీ క్రమధాటి వేంకటేశ్వర శర్మ
భ్రమరాంబ	-	శ్రీమతి సురభి అవేటి జమునారాయలు
ఘంటం	-	శ్రీ ఐ.వి.యస్.యన్. మూర్తి
వివాహాల వీరయ్య	-	శ్రీ భాగి శివశంకర శాస్త్రి
పెళ్ళిళ్ళ పేరయ్య	-	శ్రీ బంధకవి వేంకటరమణ

'వరవిక్రయం' దృశ్యాలు



(ఎడమ నుంచి) శ్రీ క్రమధాటి వేంకటేశ్వరశర్మ, శ్రీమతి సురభి అవేటి జమునారాయలు, శ్రీ బంధకవి వేంకటరమణ



(ఎడమ నుంచి) శ్రీ భాగి శివశంకరశాస్త్రి , శ్రీ క్రమధాటి వేంకటేశ్వర శర్మ, శ్రీమతి సురభి అవేటి జమునారాయలు,
శ్రీ బంధకవి వేంకటరమణ, శ్రీ ఐ.వి.యస్.యన్. మూర్తి

వరవిక్రయం

ఇప్పుడు మీరు చూడబోయే సన్నివేశంలో ఓ పాత్ర బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంటుంది. మీకు కనిపించే పాత్రలు - పుణ్యమూర్తుల పురుషోత్తమరావు, అతని భార్య, పురోహితుడు, మిగిలిన మగపెళ్ళి వారి తాలూకా మనుషులు. ఆ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి చేయడం అంటే ఎంత కష్టమో, ఆడపిల్లను కన్న తల్లిదండ్రులు ఎటువంటి ఇబ్బందులు పడేవారో, 5 రోజుల పెళ్ళి చేసిన తర్వాత 16 రోజుల పండగ దాకా ఆడపిల్లను కన్న తల్లిదండ్రులు పడేకష్టాలు, మగపెళ్ళివారు ఆడపెళ్ళివారి మీద చెలాయించే అధికారం, జులుం ఇప్పుడు మీరు చూస్తారు.

సన్నివేశం

(పురుషోత్తమరావు స్టేజ్ మీదకు వచ్చి కంగారుగా ఉంటాడు. వింగ్స్‌లోంచి హడావుడిగా మగపెళ్ళివారి తాలూకా ప్రతినిధుల హడావిడి. ఒకరు "కాఫీ, ఫలహారాలింకా అందలేదు" అని, మరొకరు "ఇప్పటికే ఆలస్యం అయిపోయింది" అని, "మగపెళ్ళివారు చాలా కోపంగా వున్నారు" అని హడావుడి చేస్తుంటారు. ఇంకా ఏవేవో కావాలని వింగ్స్‌లోంచి అరుపులు, కేకలతో అంతా గందరగోళంగా వుంటుంది. అన్ని పురమాయింపులకూ "ఇదిగో వస్తున్నాయి, అవిగో వస్తున్నాయి, ఇప్పుడే పంపిస్తున్నా,

పంపించేస్తున్నా" "చాలకపోతే మళ్ళీ పంపిస్తా" అని సమాధానాలు ఎంతో వినయంగా, ఓర్పుగా పురుషోత్తమరావు చెప్తూ ఉంటాడు.

(తన జనంతో)

పురుషోత్తమరావు: ఆ వియ్యాల వారికి మూడోసారి కాఫీలు పంపలేదట. తొందరగా పంపండి. (అని స్వగతంలో)

అయ్యా! 5 రోజుల పెళ్ళిలో 3 రోజులు గడిచింది. ఇంకా రెండు రోజులు గడపవలసి ఉంది. ఆడపిల్ల పెళ్ళి చేయడం కంటే అశ్వమేధయాగం చేయడం సులభం కదండీ... అయ్యా! ఆడపిల్ల తండ్రి కష్టాలేమని చెప్పవలె.

సీ॥ తెల్లవారఁ గనె బిందెలతోడ నీళ్ళను
పలుదోము పుల్లలఁ బంపవలయు
కావిళ్ళతో వెన్క కాఫీయు, దోసె, లి
డ్డెనలు, నుప్మాయు నడిపింపవలయు
తరువాత భోజనార్థము రండు రండని
పిలిచిన వారినే పిలువవలయు
కుడుచునప్పుడు పంక్తి నడుమ నాడుచుం బెండ్లి
వారి వాంఛలు కనిపెట్టవలయు
నొకఁడు రాకున్న వానికై యోర్పుతోడ
మంచి నీరైన ముట్టక మాడవలయు
నిన్నిటికి సైచి, వేలు వ్యయించి గౌర
వించినను నిష్ఠురములె ప్రాప్తించు దుదకు!

(పురోహితుడు (ఘంటం) రాగానే పురుషోత్తమరావు పద్యం ఆపుజేస్తాడు)

ఘంటం: అయ్యా! వియ్యపురాలు గారు లేచే వేళయ్యింది. అమ్మగార్నింకా పంపించారు కారేం?

పురు: ఎందు నిమిత్తము?

ఘంటం: ఎందు నిమిత్తమంటారేమిటి? వియ్యపురాలి గారికి తెలివిరాగానే కండ్లు తుడవాలి; కాళ్ళు మడవాలి; కోక సర్దాలి, కిందకు దింపాలి, పెరట్లోకి పంపాలి, నీళ్ళ చెంబందివ్వాలి, రాగానే కాళ్ళు కడగాలి, పండ్లు తోమాలి; మొహం తొలవాలి, నీళ్ళు పొయ్యాలి, వళ్ళు తుడవాలి, తల దువ్వాలి, కొత్తచీర కట్టాలి, కుర్చీ వెయ్యాలి, కూర్చోబెట్టాలి, పారాణి రాయాలి, గంధం పూయాలి, అత్తర్లివ్వాలి, పన్నీరుచల్లాలి, మొహాన్ని మొహరీలద్దాలి, కళ్ళకు కాసులద్దాలి, వంటిని వరహాలద్దాలి, వెండి పలుపు వెనుకకు కట్టాలి, బంగారు బలుపు పక్కకు చుట్టాలి, దిష్టి తీయాలి, హారతివ్వాలి, అద్దాన్నివ్వాలి, యిల్లాంటివి ఇంకా నా తలవెంట్రుకలన్ని ఉన్నాయి. ఆలస్యమైతే అలక కట్నం పంపించాల్సి వస్తుంది. త్వరగా పంపించండి.

పురు: ఎన్నడూ వినలేదివెక్కడి పద్ధతులు దేవుడా! దాని యవస్థతో పోల్చి చూచిన నా యవస్థయే మెఱుగు! ఓసీ ఎక్కడ?

భ్రమ: ఎందుకు పిలిచారు?

పురు: వియ్యపురాలు లేచు వేళ అయినదట వర్తమానం పంపినారు!

భ్రమ: ఇదుగో వెళ్ళుచున్నాను. మొహరీలెక్కడ?

పురు: నా చేతి పెట్టెలో వున్నవి ఇవిగో తాళములు.
(భ్రమరాంబ తాళములు తీసుకొని నిష్క్రమించును. పేరయ్య ప్రవేశం)

పురు: వచ్చినారా! ఇక రెండు దినములున్నవి. ఈ రెండు దినములుకూడా దాటించితిరా యీ జన్మమునకీ శిక్ష చాలును.

పేరయ్య: ఇది గడ్డురోజు. ఈరోజు గడిచిందంటే ఇక భయము లేదు. లింగరాజు గారు సంచులు కోసి సంభావనలిస్తారని పైవూళ్ళ నుంచి బ్రాహ్మణులు కూడా వచ్చిరట. ఆయనేమో పోలీసు వార్ని అరేంజిమెంటు చేస్తున్నారట, విన్నారా?

వీర: అయ్యా! ఫలహారాల కావిళ్ళింకా పంపించినారే కాదు. పెళ్ళివారెంతసేపు ఆగుతారు? ఎవరి మటుకు వాళ్ళు కాఫీ హోటళ్ళకు ప్రయాణమవుతుంటే పరుగు

పరుగున నేను చక్కా వచ్చాను. మగపెళ్ళివారినిలా చూస్తే మర్యాద దక్కుతుందా?

పురు: ఇదిగో ఇప్పుడే పంపుతాను. ఈపాటికి సిద్ధమైయుండును.

వీర: ఏమి కావడమో! నిన్నటి ఉప్మాలో నిమ్మపండ్ల రసమే లేదట. ఇడ్డెన్లలో అల్లం ముక్కలు లేవట. కాఫీలో పంచదార లేదట. ఈ పూట అయినా కాస్త యింపుగా వుండకపోతే పట్టుకొచ్చిన వాళ్ళ మొహాన పెట్టి కొట్టాలని పదిమందీ ఆలోచిస్తున్నారు. ఖారా కిల్లీలు కాస్త ఎక్కువగా పంపండి. చుట్టలూ, సిగరెట్లూ, బీడీలూ కాస్త శుభ్రమైనవి చూడండి. నిన్న పంపిన చీట్ల పేకలు నిన్ననే చిరిగిపోయాయి. ఈ పూటింకో నాలుగెక్కువ పంపండి. మదరాసు నశ్యము మాట మరిచిపోకండి. శలవు. మరి యాలస్యమైతే మాట దక్కదు. (నిష్క్రమణ)

పురు: ఏమి నిరంకుశాధికారము! ఏమి మిలిటరీ ఫోర్సు! మగపెళ్ళివారన మరిడీ దేవతలు కారు కదా (అంటూ ఎగ్జిట్ అవబోతుండగా)

పేరయ్య: పెళ్ళిళ్ళలో యిలాంటివన్నీ మామూలే. వాళ్ళేవేవో అంటుంటారు. మనమేవీ పట్టించుకోకూడదు. (వింగులోంచి భ్రమరాంబ అలికిడి చేసుకుంటూ ప్రవేశం).

భ్రమ: అయ్యా! పేరయ్యగారా... ఆహహహ మహానుభావా ఏరికోరి ఎంత చక్కని సంబంధం తెచ్చావయ్యా!

పేరయ్య: ఏదో తమ అభిమానం తల్లీ...!

భ్రమ: చాల్లే ఊరుకోండి. వారి లాంఛనాలు వాళ్ళు పుంజలు తెంపి పుచ్చుకొనుచున్నారు. మనకీయవలసి వచ్చినపుడు "మాకానవాయితీ" లేదనుచున్నారు. మనమిచ్చిన కట్నమును బట్టి మంగళహారతిలో మనకైదు నూటపదహార్లు రావలెను గదా? వారు వరహా కంటె వేయరట!

పురు: సరేలే ఈ మాట చెప్పుటకేనా నీవిపుడు వచ్చినది?

భ్రమ: ఇదేకాదు. ఈ పూట వియ్యపురాలి పినతల్లి కూతురు తోడి కోడలి యొక్క యాడబిడ్డ సవతి మొగమున నద్దిన మొహిరీమోటుగా నున్నదట. అందుకై ఆమె

అలిగినదట. వియ్యపురాలు విచారించుచూ గూర్చున్నదట. అమ్మలక్కలందరూ జుట్టూ మూగి ఆమెకు పురెక్కించుచున్నారట.

పురు: సరే వెళ్ళి వాళ్ళ కాళ్ళ మీదపడి కటాక్షింపుమని వేడుకొందాం పదా.

భ్రమ: చాల్లెండి ఈ గొప్ప పనికి మీరెందుకూ, నేను చాలనూ, మీరుండండి. (భ్రమరాంబ ఎగ్జిట్)

పురు: గీ॥ ఆఁడుబిడ్డ పెండ్లి అతిలోభితోఁడఁ జు
ట్టటికి మెముకలెల్ల గొరుకు లౌక్య
జాతి కింట విందు సర్వేశ్వరా! పగ
వారికి న్విధింప వలదు, వలదు ॥

మీరిక్కడే వుండండి నేను మళ్ళీ వస్తాను.
(అని పేరయ్యతో చెప్పి పురుషోత్తమరావు నిష్క్రమించును).

పేరయ్య: నేనిక్కడే వుండాలట. ఆయన మళ్ళీ వస్తాడట. ఎనిమిది వేలకూ ఏభయ్యో వందో వుంటాయి. ఇంత వరకూ నా చేతిలో పైసా పడలేదు. నాది నేను అడుక్కోవాలి కానీ ఆనక వీరిచ్చేదేమిటీ, చచ్చేదేమిటి. ఆనక వీరికన్నముంటె గదా! ఈ రోజుల్లో ఆడపిల్ల పెండ్లి చేశాక యింకా వుండేదేమిటి? వుద్దరి. తొలినాడదావిడి, మలినాడాయసం, మూడు మంగళాష్టకాలు, నాలుగు సిగపట్ల గోత్రాలు, ఆయిదు అప్పగింపులు, ఆరు అంపకాలు, ఏడు వంట బ్రాహ్మల తగవు, ఎనిమిది ఋణదాత నోటీసు, తొమ్మిది జవాబు, పది దావా, పదకొండు స్టేటుమెంటు, పన్నెండు విచారణ, పదమూడు డిక్రీ, పధ్నాలుగు టమటమా, పదిహేను వేలము, పదహారు చిప్ప. ఇదండీ ఈ రోజుల్లో పదహారు రోజుల పండగ. కాబట్టి వెళ్ళి కదిపి చూస్తాను.

ఈ కాలంలో పెళ్ళికొడుకులు ఎలా ఉన్నారంటే!

సీ॥ నీటైన యింగ్లీషు మోటారు సైకిలు
కొనిపెట్టవలెనను కూళ యొకఁడు

రిష్టు వాచియు, గోల్డు రింగును, బూట్సును
సూట్లుఁ గావలెనను శుంఠయొకఁడు
బియ్యేబిఎల్ వఱకయ్యెడి కర్చు భ
రింపవలెనను దరిద్రుఁడొకఁడు
భార్య తోడను జెన్నపట్టణంబున నుంచి
చదివింపవలెనను చవట యొకఁడు

సీమచదువు చాల సింపులు నన్నట
కంపవలయు ననెడి యజ్ఞుఁడొకఁడు
ఇట్లు కొసరుక్రింద నిష్టార్థముల్ వరుల్
దెలుపుచున్నవారు తెల్లముగను!

(పేరయ్య నిష్క్రమణ – పురుషోత్తమరావు ప్రవేశం)

సీ॥ కొసరి కట్నములందు కొంటయే గౌరవ
మని తలపోసెడి యజ్ఞులార!
వచ్చి ముద్దుగఁ బిల్ల నిచ్చెద మనఁ గట్న
ములకు బేరములాడు మూర్ఖులార!
అబ్బాయి పెండ్లితో నప్పు సప్పులు తీర్చి
నిలువ సేయగ జూచు నీచులార!
ముదుపులు గొనితెచ్చి ముంగల నిడుదాక
పల్లకి యెత్తని పశువులార!

ఏమి యన్యాయమిది! పూర్వమెన్నడేఁని
వరులనిటు విక్రయించిన వారు గలరె?
పూజ్యతరమైన మన పుణ్యభూమి యందుఁ
గట గటా! నరమాంస విక్రయము తగునె!

భ్రమ: కట్నం కోరేవారల కనువిప్పును కలిగిస్తూ ॥ కనువిప్పు ॥
తాళిని ఎగతాళి చేయు దద్దమ్మల నిలదీస్తూ ॥ దద్దమ్మల ॥

ఆలుమగల కాపురాల గోపురాలు నిర్మిస్తూ || గోపురాలు ||
అవునమ్మా భరతజననీ
అసలైన సిసలైన స్వాతంత్ర్యం వస్తుంది... || స్వాతంత్ర్యం ||
స్త్రీకి స్వేచ్ఛ తెస్తుంది... || స్త్రీకి ||
కుళ్ళిన ఈ సంఘానికి గుణపాఠం చెబుతుంది || గుణపాఠం ||
గుణపాఠం చెబుతుంది...

(వర విక్రయం నాటకంలో పద్యం, గద్యం కూడా వుండటం చేత పద్యనాటకానికి కూడా సూచికగా నిలుస్తుందనే ఉద్దేశ్యంతో సామాజిక ప్రయోజనంగా కథా వస్తువు ఉండటం చేత ముందుగా వరవిక్రయంలో ఓ ఘట్టాన్ని తీసుకొని ప్రదర్శించడం జరిగింది.)

కన్యాశుల్కం

(నాటకం)




రచన: శ్రీ గురజాడ అప్పారావు

దర్శకత్వం: శ్రీ దీక్షిత్ డి.ఎస్.

నటీనటులు :

గిరీశం	-	శ్రీ ఉత్తేజ్
వెంకటేశం	-	మాస్టర్ జగదీష్
అగ్నిహోత్రావధాన్లు	-	శ్రీ మల్లాది భాస్కర్
వెంకమ్మ	-	శ్రీమతి హైమవతి
కరటక శాస్త్రి	-	శ్రీ అద్దేపల్లి రాజ్‌కుమార్

'కన్యాశుల్కం' దృశ్యాలు



(ఎడమ నుంచి) శ్రీ మల్లాది భాస్కర్, శ్రీమతి హైమవతి, అద్దేపల్లి రాజ్‌కుమార్, మాస్టర్ జగదీష్, శ్రీ ఉత్తేజ్



(ఎడమ నుంచి) శ్రీ అద్దేపల్లి రాజ్‌కుమార్, శ్రీమతి హైమవతి, మాస్టర్ జగదీష్, శ్రీ ఉత్తేజ్

'కన్యాశుల్కం'

కృష్ణారాయపురం అగ్రహారములో అగ్నిహోత్రావధాన్లు ఇల్లు

(అగ్నిహోత్రావధాన్లు జంఝాలు వడుకుచుండును. కరటక శాస్త్రుల్లు శిష్యుడిచేత పేలు నొక్కించుకొనుచుండును. వెంకమ్మ కూర తరుగుచుండును.)

వెంక: నిన్నట్నించి కిశిమీశ్శలవులని కుర్రవాడు వుత్తరం రాశాడు. యెన్నాళ్ళో అయింది వాణ్ని చూసి. కాయలు కాసిపోయినాయి. గడియో, గడియో రావాలి.

అగ్ని: ఎందుకు వొట్టినే వగచడం? వొద్దు వొద్దంటూంటే యీ యింగిలీషు చదువులో పెట్టావ్. మెరకపొలం సిస్తంతా వాడి కిందయిపోతుంది. కిందటియేడు పరీక్ష ఫేయిలయి నాడు గదా? యీ ఏడు ఎలా తగలేశాడో తెలియదు. మన కీ యింగిలీషు చదువు – అచ్చిరాదని చెబితే విన్నావుకావు. మా పెద్దన్న దిబ్బావధాన్లు కొడుకుని ఇంగిలీషు చదువుకు పార్వతీపురం పంపించేసరికి వూష్టం వచ్చి మూడ్రోజుల్లో కొట్టేసింది. బుచ్చబ్బి కొడుక్కి యింగిలీషు చెప్పిద్దావఁనుకుంటూండగానే చచ్చినంత ఖాయలా చేసింది.

వెంక: మీరెప్పుడూ ఇలాంటి వోఘాయిత్తం మాటలే అంటూ వుంటారు: డబ్బు ఖర్చయి పోతుందని మీకు బెంగ. మొన్న మొన్న మన కళ్ళెదుట మన వాకట్లో జుట్టు విరబోసుకు గొట్టికాయలాడిన నేమానివారి కుఱ్ఱాడికి మునసబీ ఐందికాదూ?

అగ్ని: మన వెధవాయికి చదువొచ్చేదేం కనబడదుగాని పుస్తకాల కింద, జీతం కిందా ఇహ నాలుగేళ్ళయేసరికి మనభూమి కడతేరిపోతుంది. ఆపైన చిప్పా దొప్పా పట్టుకు బయల్దేరాలి. నిమ్మళంగా ఇంటి దగ్గరుంటే ఈ పాటికి నాలుగవస్థావు చెప్పేద్దును. వొద్దంటూంటే యీ వెధవింగిలీషు చదువులో పెట్టావు.

వెంక: మనవాడికో మునసబీ ఐనా, పోలీసుపనైనా ఐతే రుణాలిచ్చి యీ అగ్ఘురారం భూవుఁలన్నీ కొనేస్తాడు. యాడాదికో నూఱ్ఱుపాయలు ఖర్చు పెట్టడానికింత ముందూ, వెనకా చూస్తున్నారు. మీలాగే వాడు జంఝాలు వొడుక్కుంటూ బతకాలని వుందాయేవిటి? మీకంత భారవఁంతోస్తే మా వాళ్ళు నాకు పసుపూ కుంకానికి ఇచ్చిన భూవఁమ్మేశి కుఱ్ఱాడికి చదువు చెప్పిస్తాను.

కర: నీ భూవెఁందు కమ్మాలమ్మా? మన సొమ్ము చదతిని కొవ్వున్నాడు. అతడే పెట్టుకుంటాడు.

అగ్ని: ఐతే నన్ను ఆక్షేపణ చేస్తావషే? యీ మారంటే నీ అన్న వున్నాడని వూరుకునేది లేదు.

(గిరీశం, వెంకటేశం ప్రవేశింతురు)

వెంక: మా బాబ్బాబాబు వచ్చావషోయ్! (వెంకటేశమును కౌగలించుకొనును)

అగ్ని: వెధవాయా, యీ మారైనా పాసయినావా? (వెంకటేశం తెల్లబోయి చూచును)

గిరీ: పాసయినాడండి, ఫస్టుగా పాసయినాడు. నేను చాలా శ్రమపడి చదువు చెప్పానండి.

అగ్ని: ఈ తురకెవడోయ్?

గిరీ: టర్క్! డా'మిట్, టెల్ మాన్.

అగ్ని: మానా? మానులా వుంచా నంఛావూ? గూబ్బగలకొడతాను.

వెంకటే: (వణుకుతూ తల్లివేపు చూచి) అమ్మా, యీయ్నే నాకు చదువు చెప్పే మేష్టరు.

కర: ఇంటికి పెద్దమనిషొస్తే అప్పుచ్ఛపు మాటలాడతావేవిఁటి బావా? ఆయనేదో కుఱ్ఱవాడితో యింగిలీషు మాటంటే పుచ్చకాయ దొంగంటే బుజాల్తడువుఁకున్నట్టు నీ మీద పెట్టుకుంటావేం?

గిరీ: (కరటక శాస్త్రితో) తమ బావగారా అగ్నిహోత్రావధాన్లు గారు? నన్ను తమరు యరక్కపోవచ్చుగాని డిప్టీకలక్టర్ గారింటికి తమరు వచ్చేటప్పుడు నేను వారి పిల్లలకి చదువు చెబుతూ వుండేవాణ్ని. కలక్టరుగారు తమర్ని యేమ్మెచ్చుకునే వారనుకున్నారు?

కర: అవును, నీ మొఖం చూచిన జ్ఞాపకం వుంది. డిప్టీకలక్టరుగారు మహదొడ్డ ప్రభువ్.

గిరీ: మీలాంటి చప్పన్న భాషలూ వచ్చిన మనిషి యక్కడా లేడని, సంస్కృతం మంచినీళ్ళ ప్రవాహంలా తమరు మాట్లాడతారని తమలాంటి విదూషకుణ్ని యక్కడా చూళ్ళేదని, డిప్టీకలక్టరుగారు శలవిస్తూండేవారు. కవితారసం ఆయన్లా గ్రహించేవారేరీ? నా కవిత్వవఁంటే ఆయ్న చెవికోసుకుంటారు. మహారాజా వారి దర్శనం కూడా నాకు చేయించారండి.

అగ్ని: (ధుమధుమలాడుతూ) ఈ శషభిషలు నాకేం పనికిరావు. ఇతడి వైఖరి చూస్తే ఇక్కడే బసవేసేటట్టు కనబడుతూంది. మా ఇంట్లో భోజనం యంతమాత్రం వీలుపడదు.

వెంకమ్మ: ఆయన మాటలు గణించకు బాబూ. ఆయన మోస్తరది. మీ దయవల్ల మా వాడికో ముక్కబ్బితే మీ మేలు మరిచిపోం.

గిరీ: అందుకభ్యంతర వేఁవిటమ్మా! మీ వాడు శలవుల్లో చదువుచెప్పమని ఎంతో బతిమాలుకుంటే పోనీ, పనికొచ్చే కుఱ్ఱవాడు కదా అని వొచ్చానుగాని పట్టణంలో మునసబు గారింట భోజనం చేదనివొచ్చానా, వారిచ్చే డబ్బు చేదని వొచ్చానా అమ్మా?

వెంక: యీ చదువులకోసమని పిల్లవాణ్ణి వొదులుకుని ఉండడం,వాడు పరాయివూళ్ళో శ్రమదమాలుపడుతూండ్డం, నా ప్రాణాలు ఎప్పుడూ అక్కణ్ణే వుంఛాయి. డబ్బంటే యెన్నడూ వెనక చూళ్ళేదు గదా. మేం కనడం మట్టుకు కన్నాం. మీరే వాడికి తల్లీ, తండ్రీని. యల్లా కడుపులో పెట్టుకు చదువు చెబుతారో, మీదే భారం.

గిరీ: తమరు ఇంత దూరం శలవియ్యాలమ్మా? నా మంచి చెడ్డలు మీ కుర్రవాణ్ణడిగితే తెలుస్తుంది. మునసబుగారూ, డిప్టీ కలక్టరుగారూ యెన్నిక చేసిన మనిషిని. నా మాట నే చెప్పుకోవాలా? ఇంతెందుకూ, ఇక మూడేళ్ళు నా తరిఫీదులో వుంచితే క్రిమినల్లో వరుసగా పోలీసు పరీక్ష పాసు చేయిస్తాను.

అగ్ని: మూడేళ్ళే! ఈ సంవత్సరం పుస్తకాల కెంతవుతుందిరా అబ్బీ?

వెంక: పదిహేన్రూపాయలవుతుంది.

అగ్ని: ఒక్క దమ్మిడీ యివ్వను. వీళ్ళిద్దరూ కూడి ఆ రూపాయలు పంచుకు తినేటట్టు కనబడుతూంది. నేను వేదం యనభై రెండు పన్నాలూ ఒహ దమ్మిడీ పుస్తకాల ఖర్చు లేకుండా చదువుకున్నాను. ఇదంతా టోపీ వ్యవహారంలా కనబడుతుంది.

కర: (నవ్వుతూ) కోట్లకి విలువైన మాట అన్నావు బావా?

గిరీ: (కరటక శాస్త్రితో) దిసీజ్ బార్బరస్, చూచారండీ, జెంటిల్మెన్ అనగా పెద్దమనిషిని, యలా అంటున్నారో? నేను యిక యిక్కడ వుండటం భావ్యం కాదు. శలవు పుచ్చుకుంటాను.

వెంక: చాల్చాలు, బాగానే వుంది; యింటికెవరొచ్చినా నాకిదే భయం. ఆయన మాటలకెక్కడికి బాబూ, వెళ్ళిపోకండి.

కర: అగ్నిహోత్రావధాన్లూ! కుర్రవాడికి రవ్వంత చదువు చెప్పించడానికి ఇంత ముందూ వెనకా చూస్తున్నావ్! బుచ్చమ్మ నమ్మిన పదిహేనొందల రూపాయలేంజేశావ్?

గిరీ: సెల్లింగ్గర్ల్సు! డా'మిట్ !

అగ్ని: ప్ర'తీ గాడిదెకొడుకూ అమ్మా వమ్మా అంచూంచాడు. కూరగాయలషోయ్ అమ్మడానికి? ఆ రూపాయలు పుచ్చుకోకపోతే మొగుడు చచ్చాడు గదా... దాని గతి యావైఁ య్యుండును?

కర: చచ్చా 'డంటే వాడిదా' తప్పు? మంచం మీంచి దించెయ్యడానికి సిద్ధంగా వున్నవాడిక్కట్టా'వ్ !

గిరీ: తమరేనా నులక అగ్నిహో'త్రావధాన్లుగారు? యీ పట్టెని జటలో తమంత వారు లేరని రాజమహేంద్రవరములో మా వాళ్ళనుకునేవారు.

అగ్ని: మీది రాజమహేంద్రంషండీ? ఆ మాట చెప్పా'రు కారే రామావధాన్లుగారు బాగున్నారా?

గిరీ: బాగున్నారండి. ఆయన మా మేనమాఁవగారండి.

అగ్ని: ఆ మాట చెప్పా'రు కారు.

గిరీ: మా మావఁ యీ దేశభోగట్టా వొచ్చినప్పుడల్లా తమర్ని యెన్నిక చేస్తూంటారండి.

అగ్ని: నాకూ, వారికి చాలా స్నేహం, చూశారా కొంచెం నాకు ప్రథమ కోపం, యవరో తెలియకుండా అన్న మాటలు, గణించకండేం.

గిరీ: దానికేఁవండి. తమవంటి పెద్దలు అనడం, మాలాంటి కుర్రవాళ్ళు పడడం విధాయకవేఁగదండీ?

కర: (తనలో) యిన్నాళ్ళకి మా అగ్నిహో'త్రుడికి తగినవాడు దొరికాడు.

అగ్ని: చూశారాండీ, మీ పేరేమిటండీ?

గిరీ: గిరీశం అంటారండి.

అగ్ని: చూశారాండి, గిరీశంగారూ! మా కరటక శాస్త్రుల్లు వట్టి అవకతవక మనిషి, మంచీ, చెడ్డా ఏమి వాడి మనసు కెక్కదు. అల్లుడు చచ్చిపోయినాడంటే అందువల్ల

ఎంత లాభం కలిగింది? భూవ్యంలకి దావా తెచ్చావాఁ లేదా? నేను ఈ మధ్యే దాఖల్చేయించిన పిటీషను మీద ఆర్డరు తెచ్చావా లేదా? నేను ఈ మధ్య దాఖల్చేయించిన పిటీషను మీద ఆర్డరు చదివి పెట్టండి (గదిలోకి వెళ్ళి కాగితం తెచ్చి గిరీశం చేతికి యిచ్చును)

గిరీ: (చూసి) ఎవడో తెలివి తక్కువ గుమస్తా వ్రాసినట్లుంది.

అక్షరపోలికే లేదండి.

అగ్ని: మా వకీలు గడ గడ చదివేశాడండి.

గిరీ: నేను మాత్రం చదవలేకనా! అంతకన్న గళగ్రాహిగా చదువుతాను. లెక్చర్లిచ్చే పండితుణ్ణి. నాకిది పేలపిండీ కాదూ! అయితే రాసిన వాడి తెలివికి సంతోషిస్తున్నాము. ఇది అరటి పండు విప్పినట్టు తర్జుమా చేసి దాఖలు చెయ్యమని శలవా?

అగ్ని: ఆంతకంటేనా! (తనలో) డబ్బు ఖర్చు లేకుండా వీడిచాత కాగితముక్కలన్నీ తర్జుమా చేయించేస్తాను.

గిరీ: యింకా యింగ్లీషు కాగితాలు యేమన్నా వుంటే నా మీద పార'య్యండి. తర్జుమా చేసి పెడతాను.

అగ్ని: అష్లాగే.

వెంక: మా అబ్బాయీ, మీరూ ఒక్క పర్యాయం యింగిలీషు మాట్లాడండి బాబూ!

గిరీ: అలాగేనమ్మా.

My dear Venkatesam
Twinkle, Twinkle, little Star
How I wonder what you are,

వెంకటే: There is a white man in the tent

గిరీ: The boy stood on the burning deck
Where all but he had fled

వెంకటే: Upon the same base and on the same side of it the sides of a trapezium are equal to one another.

కర: Of man's first disobedience and the fruit of that mango tree, sing Venkatesa, my very good boy.

వెంకటే: Nouns ending in 'f' or 'fe' change their 'f' or 'fe' into, ves.

అగ్ని: యీ ఆడుతున్న మాటలకి అర్థం యేవిఁషండి?

గిరీ: యీ శలవుల్లో యే ప్రకారం చదవాలో అదంతా మాట్లాడుతున్నావఁండి.

కర: అబ్బీ వొక తెనుగు పద్యం చదవరా!

వెంకటే: "పొగచుట్టకు సతిమోవికి".....

కర: చభాష్!

గిరీ: డా'మిట్! డోంట్రీడ్ దట్. (మెల్లగా) 'నలదమయంతు లిద్దరు' చదువ్.

వెంకటే: నలదమయంతులిద్దరు మనః ప్రభవానల దహ్యమానులై సలిపిరి దీర్ఘ వాసర నిశల్...

కర: అట్టే అట్టే. 'మనః ప్రభవానల' వఁంటే యేవిట్రా?

వెంకటే: (యింటి కప్పువేపు చూసి వూరుకుండును)

గిరీ: పసిపిల్లలికి అలాంటి కఠినవైఁన పద్యానికి అర్థం తెలుస్తుందా అండి?

అగ్ని: పద్యాలికి అర్థం చెప్పరూ?

గిరీ: యిప్పటిమటుకు వేదంలాగా భట్టీయం వేయిస్తారు. తెల్లవాళ్ల స్కూళ్ళలో తెలుగు పద్యాల మీద ఖాతరీ లేదండి. యంత సేపూ జా 'గర్ఫీ గీగర్ఫీ, అర్థమేటిక్, ఆల్జీబ్రా, మా 'థమా' టిక్స్ యివన్నీ హడలేసి చెప్తారండి.

కర: (తనలో) తర్ఫీదు మా చక్కగా వుంది. వీణ్ని పెందరాళే తోవపెట్టకపోతే మోసం వొస్తుంది.

అగ్ని: అన్నోటి చెప్తారండి?

గిరీ: మరేవఁనుకున్నారు? మీ కుర్రవాళ్ళాగ చదువుకొనేవాడికి ఒక నిముషవైనా తెరిపుండదు.

అగ్ని: అదుగో, చదువంటే అష్లాగే చదువుకోవాలి. గొట్టికాయలాడకుండా మావాణ్ని ఖాయిదా చేస్తే యంత చదువైనా వొస్తుంది.

గిరీ: నా దగ్గిర గొట్టికాయలు గిట్టికాయలు పనికిరావండి. పుస్తకం చాతపడితే వేళ్ళకి పుస్తకం అంటుకుపోవాలి. అలా చదివిస్తానండి.

అగ్ని: అలాగే చేస్తే మా వాడికి చదువొచ్చి అన్ని పరీక్షలూ ప్యాసవుతాడండి. మా వాడికి డబ్బు ఖర్చు లేకుండా పెళ్ళయే సాధనం కూడా తటస్థించిందండి.

వెంక: మీ నైజం కొద్దీ చిర్రూ కొర్రూ మంచారుగాని మీకు మాత్రం అబ్బిమీద ప్రేవఁ లేదా యేవిఁషీ? పట్ణంలో గొట్టాలమ్మొచ్చినప్పుడు యంతో బెంగ పెట్టుకొని అబ్బిని శలవర్జీ రాశి' వెళ్ళిపొమ్మన్నారు కారా? చదువూ చెప్పించక, పెళ్ళీ చెయ్యక తీరుతుందా యేవిషీ?

కర: డబ్బు ఖర్చు లేకుండా కొడుక్కి పెళ్ళిచేస్తావుషోయి బావా? ఆడపిల్లల్ని అమ్మినట్టే అనుకున్నావా యేవిఁషీ? పదిహేనొందలైనా పోస్తేనేగాని అబ్బికి పిల్లనివ్వరు.

అగ్ని: డబ్బు ఖర్చు లేకుండా వెంకడికి యలా పెళ్ళి చేస్తానో నువ్వే చూతువుగాని, రామచంద్రపురం అగ్రహారంలో లుబ్ధావధాన్లు గార్ని యెరుగుదువా?

కర: యరగను.

అగ్ని: ఆయ్న లక్షాధికారి, పద్దెనిమిది వందలికి సుబ్బిని అడగొచ్చారు. ఉభయ ఖర్చులూ పెడతారష. పెళ్ళి మా వైభవంగా చేస్తారష. మనం పిల్లని తీసికెళ్ళి వాళ్ళింటే పెళ్ళి చెయ్యడం. మనకి తట్టుబడి అట్టే వుండదు. ఆ పద్దెనిమిదివొందలూ పెట్టి వెంకడికి పెళ్ళి చేస్తాను.

వెంక: పెళ్ళికొడు క్కెన్నేళ్ళు?

అగ్ని: యెన్నేళ్ళయితేనేఁవి ? నలభై య్యయిదు.

గిరీ: లుబ్ధావధాన్లు మా పెత్తల్లికొడుకండి. తమతో సమ్మంధవంటేనాకు సంతోషవేఁ గానండి ఆయనకి అరవయ్యేళ్లు దాటాయండి. యీడేఁవయినా సెల్లింగ్ గరల్స్, అనగా కన్యాశుల్కం, డామిట్! యంత మాత్రం కూడదండి. నేను పూనాలో వున్నప్పుడు అందు విషయమై ఒహనాడు నాలుగ్గంటలు ఒక్క బిగిని లెక్చరిచ్చానండి. సావకాశంగా కూర్చుంటే కన్యాశుల్కం కూడని పనని తమ చేతనే వొప్పిస్తాను.

కర: బావా ! ఈ సమ్మంధం చేస్తే నీ కొంపకి అగ్గెట్టేస్తాను.

అగ్ని: వీళ్ళమ్మా ! శిఖా తరగా, ప్రతి గాడిద కొడుకూ తిండిపోతుల్లాగా నా యింటజేరి నన్ననేవాళ్ళే, తాంబోలం యిచ్చేసాను? ఇహ తన్నుకు చావండి.

వెంక: నాతో చెప్పకుండానే!

అగ్ని: ఆడముండల్తోనా ఆలోచన? యీ సమ్మంధం చెయ్యకపోతే నేను బారిక రావుణ్నే ! (లేచి వెళ్లును)

కర: యేం మార్దం!

వెంక: అన్నయ్యా! ఈ సమ్మంధం చేస్తే నేన్నుయ్యో, గొయ్యో చూసుకుంటాను. పెద్దదాన్ని రొమ్ము మీద కుంపట్లాగ భరిస్తూనే ఉన్నాం. ఆయనకి యింత యీడొచ్చినా కష్టం

సుఖం వొళ్లు నాటక యీ దౌర్భాగ్యపు సమ్మంధం కల్పించుకొచ్చారు. నే బతికి బాగుండాలంటే ఈ సమ్మంధము తప్పించు.

కర: గట్టి అసాధ్యం తెచ్చిపెట్టావే. ఒట్టి మూర్ఖపు గాడిదకొడుకు. యెదురు చెప్పినకొద్దీ మరింత కొర్రెక్కుతాడు. యేం చేయగలుగుదునని నీకు భరువసా చెప్పను? యేమీ పాలుపోకుండా ఉంది.

సాక్షి

(వ్యాసాలు)




రచన: శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు

నాటకీకరణ - దర్శకత్వం: శ్రీ దీక్షిత్ డి.ఎస్.

నటీనటులు :

వ్యాఖ్యాత	-	శ్రీ దీక్షిత్ డి.ఎస్.
సభాధ్యక్షులు	-	శ్రీ బంధకవి వేంకట రమణ
జంఘాల శాస్త్రి	-	శ్రీ బుఱ్ఱా సుబ్రహ్మణ్యశాస్త్రి
ఆంధ్ర బాలక సంఘ సభ్యులు	-	శ్రీ అచ్యుతుని శివరామప్రసాద్
		శ్రీ క్రమధాటి వేంకటేశ్వర శర్మ
		శ్రీ భాగి శివశంకరశాస్త్రి
		శ్రీ ఎ. రాజ్‌కుమార్

'సాక్షి' దృశ్యాలు



(ఎడమ నుంచి) శ్రీ క్రమధాటి వేంకటేశ్వర శర్మ, శ్రీ బంధకవి వేంకటరమణ, శ్రీ అచ్యుతుని శివరామప్రసాద్, శ్రీ భాగి శివశంకర శాస్త్రి, శ్రీ దీక్షిత్ డి.ఎస్.



జంఘాల శాస్త్రి పాత్రధారి శ్రీ బుఱ్ఱా సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి
ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డిగారిచే సత్కారం

సాక్షి

వ్యాఖ్యాత

(మైకు ముందు నిలబడి, గొంతు సవరించుకొని, సభను పరికించి) "ఆంధ్ర బాలక సంఘం" ప్రత్యేకం చిన్నారుల కోసం అని ఆరంభించుకున్న సంగతి మీకందరికీ తెలిసినదే. ఈ సమావేశానికి బాలబాలికల్ని, వారి తల్లిదండ్రుల్ని, స్వభాషాభిమానుల్నీ అందర్నీ ఈ సభకు ఆహ్వానించాం. అందరూ వచ్చారు. మా ఆహ్వానాన్ని మన్నించి, మీ సమయాన్ని వెచ్చించి వచ్చిన మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాను. కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ రోజు ఒక్క ఘడియ కూడా విరామం దొరకని న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న పెద్దలు, ఎం.ఏ., బి.ఎల్. గారుగా ప్రసిద్ధి పొందిన వారు. వారి తల్లిదండ్రులు పెట్టిన పేరు చెబితే కూడా తెలియని వారే ఈ సభలో ఎక్కువ మంది ఉన్నారు. (ఈ వ్యాఖ్యకు వేదిక మీదున్న ఇతర పెద్దల రియాక్షన్)

వ్యాఖ్యాత: ఎం.ఏ., బి.ఎల్ గార్ని అంటే "చిన్న భాష్యం" గారిని ఈ రోజున అధ్యక్షోపన్యాసం ఇవ్వడానికి మనం అహ్వానించుకున్నాం. మా బాలకసంఘం నెలవారీ సభకు తమరు విచ్చేసి ఉపన్యసించాలని కోరగానే మన కోరికను మన్నించి వారు

రావడం మన అదృష్టం. గత మాసంగా ప్రయత్నిస్తే ఈ రోజు వారు ఇక్కడకు రావడానికి వీలైంది. కనుక మా "ఆంధ్ర బాలక సంఘం" కార్యవర్గ సభ్యులందర్నీ మీరు వేదిక మీద చూస్తూనే వున్నారు. వీరంతా మీకు తెలిసిన వారే. వీరందరి తరపున ఈనాటి సభా నిర్వాహకునిగా చిన్నభాష్యం గారిని... (వెనుక నించి ఒక సభ్యుడు వ్యాఖ్యాత దగ్గరకు వచ్చి చెవిలో నెమ్మదిగా 'ద్వివేదం చినభాష్యం' అని చెబుతాడు.)

వ్యాఖ్యాత : మా సభ్యులు చెబుతున్నారు. "ద్వివేదం చినభాష్యం" గారట.

వ్యాఖ్యాత : (జనంతో) చినభాష్యం గారంటేనే మీకెవరికీ తెలీదు. "ద్వివేదం" అని చెప్పి ప్రయోజనం ఏముంది. అంచేత మన ఎం.ఏ., బి.ఎల్ గారిని అధ్యక్షోపన్యాసం ఇవ్వడానికి వేదిక మీదకి రమ్మని కోరుతున్నాను. మీ కరతాళ ధ్వనుల మధ్య, మా కార్యవర్గ సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య సమయం వృధాకాకుండా వారు వేదిక మీదకు దయచేస్తారు.

(ఎం.ఏ., బి.ఎల్ గారు వేదిక మీదకి వస్తారు. అందరూ సాదరంగా వేదిక మీదకి ఆహ్వానిస్తారు. కార్యవర్గ సభ్యులందరితో కరచాలనం చేసి సభలోని ప్రేక్షకులకు తన శైలిలో చేతులు ఊపి చిరునవ్వు చిందిస్తూ కుర్చీలో కూర్చుంటాడు.)

వ్యాఖ్యాత : ఇప్పుడు మేం ప్రతినెలా జరుపుకునే "ఆంధ్ర బాలక సంఘం" సమావేశానికి సభాధ్యక్షులుగా విచ్చేసిన ఎం.ఏ., బి.ఎల్. గారికి మా సంఘం తరపున ఉడతా భక్తిగా చిరు సత్కారం.

(మంగళ వాద్యాల మధ్యన వారి మెడలో ఓ సభ్యుడు దండ వేస్తాడు. మరో సభ్యుడు శాలువా కప్పుతాడు.. ఫోటో కోసం ఇద్దరూ ఫోజులివ్వడానికి ప్రయత్నిస్తారు. సభలో జనం చప్పట్లు కొడుతూ ఉంటారు.)

వ్యాఖ్యాత : ఇప్పుడు మీ కరతాళ ధ్వనులు ముగియగానే సభాధ్యక్షులు ఎం.ఏ., బి.ఎల్. గారు అంటే ద్వివేదం చినభాష్యం గారు అధ్యక్షోపన్యాసాన్ని కొనసాగిస్తారు.

(ఎం.ఏ.,బి.ఎల్. గారు లేచి నిలబడతారు. సభను రకరకాల పోజుల్లో పరికిస్తారు. వ్యాఖ్యాత వచ్చి మైకును సరిదిద్దబోతే)

M.A., B.L.: No... I will adjust. I adjust myself

(వ్యాఖ్యాత తప్పుకుంటాడు)

M.A., B.L.: Well. Ladies & Gentlemen and my dear beloved children of Andhra Balaka Sangham! Today inspite of my busy schedule though I can't spare much time, I am forced to attend this meeting to give my Valuable Message. All the children (వ్యాఖ్యాత వినయంగా సభాధ్యక్షుని దగ్గరకు వచ్చి "దయచేసి తెలుగులో మాట్లాడితే మన వాళ్ళందరికీ అర్థం అవుతుంది......")

M.A.,B.L. : No. No. I am afraid. I can't speak fluent Telugu. So you are all have to bear with me because I would like to emphasise you one and all. Today my giving a valuable message - that is my saying a beautiful message about health. Yes Health. "Health is Wealth". Well Health is Wealth. One has to maintain proper health because a healthy man can deliver goods (కార్యవర్గ సభ్యుల రియాక్షన్) upto his satisfaction, without fail throughout his entire life. So health is wealth. Well how to maintain health - by doing excercise. Yes.... by doing excercise regularly. (M.A.. B.L. ఉపన్యాసమంతా ఎక్కువగా ఆంగిక విన్యాసాలతో కలసి సాగుతుంది. కార్యవర్గ సభ్యుల ప్రతిస్పందనలు కూడా తదనుగుణంగా సాగుతూ ఉంటాయి.) Yes because health is wealth. The regular... (వ్యాఖ్యాత వచ్చి ఏమీ అర్థం కానట్లుగా ఉన్న విషయం M.A., B.L., చెవిలో చెప్తాడు. M.A., B.L. చిరాగ్గా తలవూపి) Bear with me. The first and foremost excercise is breathing. Yes... breathing. How to do breathing. Pumping in oxygen through one hole of the nose and delivering it through the other hole of the nose.(ఈ ప్రక్రియను విన్యాసాల

ద్వారా చూపిస్తాడు.). This is breathing excercise. That is very popular as what we call in Sanskrit... Yah... Pranayama. Not only the children but also the adults. You all have to repeatedly, repeatedly practise the same breathing excersie and thereby maintain perfect health. What is the use of this breathing. The air passes to the entire body and keep the man attentive and active. So health is wealth. That's all. I don't have much time. So this message I feel is more than enough for all of you. Will any gentleman come forward to speak.

(ఇంతలో "అయ్యా! నేను మాట్లాడతాను" అని వినబడడంతో కార్యవర్గ సభ్యులంతా ఎవరా అనిచూస్తూ జంఘాల శాస్త్రిగారని గ్రహించి సంతోషంతో ఉంటారు.)

వ్యాఖ్యాత : అయ్యయ్యో! జంఘాల శాస్త్రిగారు... మనం గమనించనే లేదు.

(అంటూ జంఘాల శాస్త్రిని స్టేజి మీదకు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య సాదరంగా ఆహ్వానిస్తారు. స్టేజి మీదకు వచ్చిన జంఘాల శాస్త్రిగారిని పూలమాల, దుశ్శాలువాతో ఆంధ్ర బాలక సంఘం ప్రతినిధులంతా సత్కరించుకుంటారు. ఆ తర్వాత వ్యాఖ్యాత మైకును సరిచేసి జంఘాల శాస్త్రిగారికి అప్పజెప్తాడు. జంఘాల శాస్త్రి ఉపన్యాసం మొదలవుతుంది.)

జంఘాల: తెలుగు వాడై, ఈ గడ్డన పుట్టి, ఈ నీళ్ళు త్రాగిన మనిషి, తెలుగు వారైన తల్లిదండ్రులకు పుట్టిన మనిషి ఇంగ్లీషు భాషలో పాతికేళ్లు కృషి చేస్తేనేమి? పెద్ద న్యాయవాది అయితేనేమి ఆంధ్రము రాదట. ఆంధ్రమున మాట్లాడలేడట. నాయనలారా! మీరు కూడా వింటిరి కదా! వినకయేమి చెవులు చిల్లులు పడినవా? మతిమందగించి నదా? వినకపోవుట గూడానా! గుండెలు పగిలిపోవ వింటిమి. మనస్సు మండిపోవ వింటిమి. సిగ్గు చిమిడిపోవ వింటిమి. ఏదో విని మరియేదోయని భ్రమ పడితినా? నాయనలారా అట్లే యగునెడల అదృష్టవంతుడను గదా! నేనొక్కడను మాత్రమే అదృష్టవంతుడనా? ఆంధ్రులందరూ అదృష్టవంతులే కదా! ఆంధ్ర దేశమంతయూ అదృష్టవంతమైనదే కదా. ఆంధ్ర దేశమున పుట్టి, ఆంధ్ర మాతాపితలకు జన్మించి,

ఆంధ్ర సంప్రదాయములభ్యసించి, ఆంధ్ర భాషలో పండితులై ఆంధ్ర గ్రంథములు రచించి, ఆంధ్రదేశ సేవ నాచరించి తమ అంగములు నసువులు నాత్మలు పవిత్రము లుగాఁ చేసికొని ప్రాణములను బాసి పరమపదమును చేరిన ప్రాచీనాంధ్రులందరూ కూడా అదృష్టవంతులే కదా! అయ్యయ్యో అంత అదృష్టము పట్టునా పట్టదు. వింటిని. నిజముగా వింటిని నాది భ్రమము కాదు. అతనికి ఆంధ్రభాష రాదట. ఆంధ్రమున మాట్లాడలేడట. ఆంధ్రమున మాట్లాడిన మైల పడుదునేమోనని భ్రమ పడుచున్నాడు. ఆంధ్రము దిక్కుమాలిన భాషయని అతని తాత్పర్యము. ఆంధ్రము రాదట. ఆంధ్రమున మాట్లాడలేడట. ఆంధ్రమున మాట్లాడలేకపోవుట యేమి? మూగవారు కారే? నంగి నంగి మాటలవారు కారే? మమ్మే పెప్పె యనువారు కారే? ఇదిగాక బి.ఎల్. పరీక్షలో గడతేరి ఒక న్యాయవాదియై కాలాంబర కవచధారియై న్యాయమూర్తుల యెదుట కాకిని గ్రద్దను, గ్రద్దను కాకిని చేయగలిగే కర్కశతర్క వాగ్వాహినీ మోహినీకరణదక్షులే. మరి ఎందులకు ఆంధ్రమున మాట్లాడలేరు. మ్యావు మ్యావుమని కూయలేని పిల్లి ఎచ్చటనైనా యున్నదా; కిచకిచ లాడలేని కోతిని మీరెచ్చటనైన జూచితిరా? ఈత రాని కప్ప యేదేశమందైనా నుండునా! ఆంధ్ర దేశమున పుట్టిన పక్షులైన ననవరత శ్రవణమున ఆంధ్రమున మాటలాడుచుండగా అయ్యయ్యో! మనుజుడే! ఆంధ్ర మాతాపితలకు పుట్టినవాడే అధమాధమము ఆరు సంవత్సరముల యీడువరకైన ఆంధ్రమున మాటలాడినవాడే? అట్టివాడు ఆంగ్లభాషనభ్యసించినంత మాత్రమున యిప్పుడాంధ్రమున మాటలాడలేకుండునా ఆశ్చర్యము. అవిశ్వస నీయము. అసత్యము. ఆంధ్రమున మాటలాడిన తలస్నానం బాచరింపవలయునని యేమో ఆయనకు భయము కాబోలు. అయ్యయ్యో! మన భాషయే – మహానంద కందళ సందోహ సంధాన తుందిలమగు మాతృభాషయే. కమ్రతకు కమ్రత, కఠినతకు కఠినత, వదులునకు వదులు, బిగువుకు బిగువు, జోరుకు జోరు, ఎదురెక్కున కెదురెక్కు, మందతకు మందత, ధాటికి ధాటి,ఇన్ని వన్నెలు, చిన్నెలు, వగలు, వద్దికలు, తళుకులు, బెళుకులు, హొయలు, వయ్యారములు కలిగిన మాతృభాషయే, వ్యాసమునకు ఉపన్యాసమునకు, కవిత్వమునకు, గానమునకు, పద్యమునకు సంపూర్ణార్హత గల భాషయే. తల్లి స్తన్యముతో గూడ ఏ భాష మనము త్రావుదుమో ఆ భాషలోనే

మనమెన్నటికైన కఠిన ప్రయత్నమొనర్చిన యెడల ఉపజ్ఞానసహితమగు ఉత్తమ గ్రంథమును వ్రాయగలము. ఆంధ్రుడవయి ఏల పుట్టితివి? ఆంధ్రము రాదని చెప్పుచున్నావు. ఏలరాదు. నీవే పుస్తకములు చదువనక్కరలేదు. దినమునకొక్కసారి రాత్రి భోజనమయిన తర్వాత ఆలిని, బిడ్డల్ని నీ చుట్టూ కూర్చుండబెట్టుకుని ఆంధ్రపత్రికను చదవరాదా! నాలుగు మాసములట్లు చదువుము. ఆంధ్రము ఎందులకు రాదు. నీవు నేర్చిన పరభాషాజ్ఞానము అంతయూ నీ భాష వృద్ధిపరచుటకే. ఆంగ్లభాష బొత్తిగా రానివానితోకాని మీరాంగ్లేయము నెన్నడూ మాటాడవలదు. మీ మిత్రులకుత్తరము రాయునపుడైనా 'మహారాజశ్రీ' తో ఆరంభించి 'చిత్తగింప వలయును'తో పూర్తి చేయవలయును. పుట్టుక చేతనేగాక బుద్ధిచేత, స్వభావము చేత ఆంధ్రులని అనిపించుకొనుడు.

గణపతి

(నవల)




రచన: శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం

నాటకీకరణ: శ్రీ సి.ఎస్.రావు దర్శకత్వం: శ్రీ దీక్షిత్ డి.ఎస్.


నటీనటులు :

గణపతి	-	శ్రీ పి.వి. సుబ్రహ్మణ్యం
నాగన్న	-	శ్రీ గోపరాజు రమణ
ఉపాధ్యాయుడు	-	శ్రీ బుఱ్ఱా సుబ్రహ్మణ్యశాస్త్రి
సింగమ్మ	-	శ్రీమతి రత్నా సాగర్
మేనత్త	-	శ్రీమతి ఢిల్లీ రాజేశ్వరి

'గణపతి' దృశ్యాలు



(ఎడమ నుంచి) శ్రీ పి.వి. సుబ్రహ్మణ్యం, శ్రీ బుఱ్ఱా సుబ్రహ్మణ్యశాస్త్రి



(ఎడమ నుంచి) శ్రీమతి ఢిల్లీ రాజేశ్వరి, శ్రీమతి రత్నాసాగర్, శ్రీ గోపరాజు రమణ

గణపతి

(గణపతి ఊరుచివర వున్న పోలేరమ్మ గుడి ముందు నిలబడి చుట్టకాల్చుకుంటూ వుంటాడు. చటుక్కున ఏదో ఆలోచన వచ్చి చుట్ట ఆర్పేసి చెవిలో పెట్టుకుంటాడు. చేతులు దులిపేసుకుని అమ్మవారి గుడి ముందుకు వెళ్ళి నిలబడి దణ్ణం పెట్టి)

గణ: అమ్మ పోలేరమ్మ తల్లీ ! నువ్వు మా గ్రామ దేవతవి. మశూచి, పొంగు, ఆట్లమ్మ, జాడ్యం లాంటి ప్రమాదకరమైన రోగాలు రాకుండా నువ్వే కాపాడతావని మా వూరి జనాని కందరికీ నమ్మకం. అందుకే అలాంటి రోగాలు వచ్చిన వారు బతికి బాగుంటే నీకు మొక్కులు చెల్లించుకుంటారు. మేకల్ని, కోళ్ళను, ఎనుబోతుల్ని నీకు బలిస్తారు. నైవేద్యాలు పెడతారు. అలాంటి రోగాలు రాకుండా చూడమనీ, గ్రామాన్ని కాసుకోమని కూడా నీకు బలులు యిస్తారు. నైవేద్యాలు పెడతారు. కాని నా మొక్కు అదికాదు పోలేరమ్మ తల్లీ!

(ఇంతలో గణపతి మాష్టారు బెత్తం చేత పట్టుకుని అక్కడ గణపతిని చూసి ఆగిపోతాడు. గణపతి అమ్మవారితో ఏం మాట్లాడుతున్నాడో జాగ్రత్తగా వింటూ నిలబడ్డాడు.)

గణ: నా మొక్కేమిటంటే తల్లీ ! (ఇటూ అటూ చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాక) మా మాష్టారు నన్ను రోజూ నాలుగు వాయించి బడికి లాక్కుపోతాడు. బడికెళ్ళాక చదవలేదని మళ్ళీ కొడతాడు. ఆ దెబ్బలే పడలేకుండా వున్నాను. అందుకని మా మాష్టారుకి చిన్న చిన్న పొంగు, ఆట్లమ్మాలాంటి జబ్బులు కాకుండా మశూచి వచ్చేలా చూడు తల్లీ. మాష్టారుకి మశూచి వచ్చి తగ్గాలని కాదు నా మొక్కు! ఆ జబ్బుతో ఆయన పోవాలని నా మొక్కు. అలా ఆయన పోతే మా అత్తయ్య వొత్తుల డబ్బాలోంచో, మా మావయ్య జేబులోంచో డబ్బులు దొంగిలించి ఓ మేకని కొని నీకు బలిచ్చుకుంటాను. ఇహ నాకు బడి గోల ఉండదు. దెబ్బలు తప్పుతాయి.

మాష్టారు: (మేష్టారు గణపతి మాటలు విని పళ్ళు బిగించి తనలో) అమ్మవారి గుడి ముందు దణ్ణం పెడుతూ నిలబడితే ఎందుకో అనుకున్నాను. ఇదిరా నీ మొక్కు ముదనష్టం వెధవ!

గణ: ఒక వేళ మాష్టారుని తీసుకుపోవడానికి వీలు పడకపోతే కనీసం కళ్ళేనా పోయేలా చూడు – రెండు కళ్ళూ పోయేలా చూడు. అలా చేసినా యింక నా కోసం వెతకలేడు. వెతికినా నే కనబడను. ఇలా చేస్తే కోడిని బలిచ్చుకుంటా!

మనిషి పోతే మేక! కళ్ళు పోతే కోడి! ఖాయం.

మాష్టారు : (గణపతి వెనకాలేవెళ్లి బెత్తెంతో ఓ దెబ్బ వేస్తాడు – గణపతి అరుస్తాడు) – ఇదిరా పోలేరమ్మతో నీ మొక్కు. నేను పోవాలా, లేకపోతే కళ్లైనా పోవాలా, (అంటూ గణపతిని పట్టుకొని కొట్టడానికి ప్రయత్నిస్తాడు. గణపతి మాష్టారుని గెంటేసి తప్పించుకుని పారిపోతాడు. మేష్టారు మోకాలుకి దెబ్బతగులుతుంది)

(నరసింహం మాష్టారు డెక్కుతూ, మూలుగుతూ రొప్పుతూ వస్తాడు.)

నాగన్న: (మేష్టారుతో) బడి వేళప్పుడు బడి వదిలేసి ఇలా వచ్చారేమిటి పంతులు గారూ!

మాష్టారు: మీ గణపతి ఉన్నాడు చూశారూ!

సింగమ్మ: గణపతి ఇంట్లో ఎక్కడున్నాడండీ పొద్దున్నే చద్దన్నం తిని బడికి వెళ్ళిపోయాడుగా!

మాష్టారు: చద్దన్నం తిన్నాడేమో గానీ బడికి రాలేదు సింగమ్మగారూ!

సింగమ్మ: పసిపిల్లాడి మీద నిందలు వెయ్యకండి మాష్టారు. బడికి వెడుతున్నానని నాకు చెప్పే వెళ్ళాడు నా కొడుకు.

నాగన్న: నీకు చెప్పిందే నీ కొడుకు చెయ్యాలని ఎక్కడుందే అమ్మాయ్.

మాష్టారు: వాడు బడికొస్తే నేనిక్కడకెందుకొస్తాను తల్లీ సింగమ్మ తల్లీ.

నాగన్న: బడి వేళప్పుడు బడి వదిలేసి ఇలా దిగబడ్డారేం.

మాష్టారు: (పంచె మోకాలుదాకా ఎత్తి, మోకాలుకి తగిలిన దెబ్బ చూపించి) చూశారా?

నాగన్న: అయ్యో! అంతదెబ్బ ఎలా తగిలిందండీ!

సింగమ్మ: తూలి పడ్డారేం పాపం.

మాష్టారు: పడలేదమ్మా. మీ గణపతి పడగొట్టాడు.

సింగమ్మ: పిల్లవెధవ వాడెలా పడగొట్టగలడండీ మిమ్మల్ని.

నాగన్న: నీ వెధవ ప్రశ్నలాపి ఆయన్ని చెప్పనివ్వవే అమ్మాయ్. గణపతి పడగొట్టడం ఏమిటి పంతులుగారూ?

మాష్టారు: దెబ్బ చూశారా! అసలే మధుమేహం ముండా వాడ్ని. కోతిపుండు బ్రహ్మరాక్షసయ్యిందన్నట్టు ఈ దెబ్బ ఎక్కడికి దారి తీస్తుందో? ఏమో?

నాగన్న: దెబ్బ సంగతి తర్వాత చూద్దాం. ముందు మా వాడికీ, ఈ దెబ్బకీ సంబంధం ఏమిటో శెలవియ్యండి పంతులుగారూ!

మాష్టారు: వస్తున్నా! వస్తున్నా. అక్కడికే వస్తున్నా... మీవాడు ఎంతకీ బడికి రాకపోవడంతో ఇద్దరు పిల్లల్ని వెంటేసుకుని మీ యింటికేసి బయలుదేరాను. దార్లో పోలేరమ్మ గుడి ముందు మీ గణపతి నిలబడి పోలేరమ్మకు మొక్కుతున్నాడు.

సింగమ్మ: వాడికి భక్తి ఎక్కువ. ఏమని మొక్కుకుంటున్నాడు బాబూ!

మాష్టారు: ఏమనా? పొంగు, ఆట్లమ్మ, జాడ్యం, మశూచి మొదలైన రోగాలు అన్నింటికీ నీవే కారణం అంటారు. అలాంటి రోగాలు రాకుండా నీకు కోళ్ళని, మేకల్ని బలిస్తారు కదా జనం. నాయందు దయవుంచి మా పంతులుగారికి మశూచి వచ్చేలా చూడుతల్లీ. అని.

సింగమ్మ: మీది మరీ విడ్డూరం గానీ, మీకు మశూచి వస్తే వాడికేం లాభం.

మాష్టారు: నేనూ మీలాగే అనుకుని శ్రద్ధగా విన్నాను. నీ కొడుకు మొక్కుబడి నాకు మశూచి వచ్చి నాకళ్ళు పోవాలట. నా కళ్ళు పోతే నేను వాడ్ని చూడలేనట. చూడలేకపోతే కొట్టలేనట. అందుకు నాకు మశూచి వచ్చి కళ్ళు పోవాలట.

నాగన్న: వెధవని పట్టుకుని నాలుగు తగిలించకపోయారా?

మాష్టారు: అలా అనుకునే వాడ్ని పట్టుకోబోయాను. తప్పించుకు పరిగెత్తాడు. వెంట పడ్డాను. బోర్లాపడ్డాను. ఇదుగో మోకాలు చిప్ప పగిలిపోయింది. గాయమయ్యింది. చచ్చే నొప్పి, పైగా మధుమేహం ముండావాడ్ని.

నాగన్న: సింగమ్మా నీ కొడుకు రోజు రోజుకి పేట్రేగి పోతున్నాడు. వాడికి బుద్ధి చెప్తేగానీ దారికి రాడు వెధవ.

భార్య: (లోపల్నించే) ఏమండోయ్!

నాగన్న: ఏమిటే ఆ గావు కేకలు.

భార్య: దాన్ని కాకి ఎత్తుకుపోయిందండీ! (పంచెతో వచ్చి) ఇదిగోచూడండి రూపాయి బిళ్ళ కట్టిన ఆనవాలు వుందిగానీ రూపాయి బిళ్ళలేదండీ!

మాష్టారు: పోలేరమ్మ గుడి దగ్గర చుట్టలు కాల్చుకుంటూ వున్నాడండీ! యీ డబ్బులు తోటే చుట్టలు కొనుక్కుని వుంటాడు.

నాగన్న: వెధవ దొంగతనం కూడా మొదలెట్టాడన్న మాట. చెప్తాను యింటికి రానీ వాడి సంగతి. మీరు వెళ్ళండి పంతులుగారూ... సాయంత్రం డబ్బులు పంపిస్తాను మీకు.

సింగమ్మ: నువ్వెన్నన్నా చెప్పు వాడు దొంగతనం చేశాడంటే నేను నమ్మను. తండ్రిలేని పిల్లాడిని అందరూ వాడిమీద నిందలు వేసేవాళ్ళే.

నాగన్న: ఇంట్లో వున్నది నువ్వు, నేను, అదీ. నువ్వు తియ్యవు. నేను తియ్యలేదు. అది తియ్యదు. ఇక మిగిలింది నీ కొడుకు. వాడు కాక యింకెవరు తీస్తారే?

సింగమ్మ: ఎవరు తీస్తారంటే నేనేం చెప్పనురా! వాడంటే గిట్టని వాళ్ళు తీసి వాడి మీద నెట్టొచ్చుగా!

భార్య: అతనంటే గిట్టనివాళ్ళు ఎవరండీ మనయింట్లో?

సింగమ్మ: ఏమోనమ్మా! వాళ్ళ మావయ్య దృష్టిలో వాడు దొంగయ్యాడు ఆఖరికి.

నాగన్న: అర్థంలేని వాగుడు వాగకు. దానికి మేనల్లుడంటే గిట్టదా? అర్థంలేని గారాబం చేసి కుర్రవెధవని పాడు చేస్తున్నావ్. వాడు ఎన్ని వెధవ వేషాలు వేసినా వంటి మీద యీగ వాలనివ్వవు.

సింగమ్మ: తల్లి ప్రాణం కదరా!

నాగన్న: తల్లి ప్రాణం, తల్లి ప్రాణం అని యిలా వెనకేసుకుని వస్తే తరువాత తోటకూర కాడనాడైనా ఎరగనైతినా అని ఏడవాల్సొస్తుంది.

భార్య: మొక్కై వంగనిది మానై వంగుతాడా ఏమిటి?

సింగమ్మ: (కోపంగా చూస్తుంది)

భార్య: మధ్యాహ్న భోజనానికి వేళవుతోంది. వెతికి తీసుకురండి. అతనికి అసలే ఆకలెక్కువ.

నాగన్న: దాన్ని పట్టుకుని నీ కొడుకు మీద నింద వేసిందంటావ్. పదండి లోపలికి. (ముగ్గురూ లోపలికి వెడుతుంటారు. ఇంతలో గణపతి వస్తాడు.)

నాగన్న: ఇప్పుడెక్కడ్నించి వస్తున్నావురా.

గణపతి: బడి నుంచి

నాగన్న: బడి నుంచా! వెధవ అబద్ధాలూ – పైగా కొంగున కట్టిన డబ్బులు పట్టుకుపోయి చుట్టలు కాల్చడమూనట్రా అంట్ల వెధవా.
(అంటూ గణపతిని పట్టుకుని తాడుతో కట్టేసి) నిన్ను చెట్టుక్కట్టేసి నాలుగు తగిలిస్తే గాని బుద్ధిరాదు (అంటూ లాక్కుపోతాడు. తల్లీ మేనత్త కదలని గణపతిని గెంటుతారు.)

ది పర్‌ఫెక్ట్ వైఫ్

(కథ)



రచన: శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

నాటకీకరణ: శ్రీ సి.ఎస్.రావు

దర్శకత్వం: శ్రీ దీక్షిత్ డి.ఎస్

నటీనటులు :

మునిమాణిక్యం	-	శ్రీ అచ్యుతుని శివరామప్రసాద్
కాంతం	-	శ్రీమతి కె. విజయలక్ష్మి (విశాఖపట్నం)

4

'ది పర్‌ఫెక్ట్ వైఫ్' దృశ్యాలు



శ్రీమతి కె. విజయలక్ష్మి, శ్రీ అచ్యుతుని శివరామప్రసాద్



శ్రీ అచ్యుతుని శివరామప్రసాద్, శ్రీమతి కె. విజయలక్ష్మి

'ది ఫర్‌ఫెక్ట్ వైఫ్'

(మునిమాణిక్యం గారు కొన్ని బొమ్మలూ – మరికొన్ని బొమ్మల పుస్తకాలూ మోసుకుని యింటికి వస్తారు. భార్య కాంతం పుస్తకాలు మోసుకొస్తున్న ఆయనకు ఎదురెళ్ళి)

కాంతం: ఏమిటండీ యివన్నీ?

ముని: బొమ్మలు, బొమ్మల పుస్తకాలూనూ.

కాంతం: ఇన్ని బొమ్మల పుస్తకాలు ఎక్కడివండీ? కొన్ని బొమ్మలు విడిగా కూడా ఉన్నాయే!

ముని: నీ కోసమే తెచ్చాను. చూడు ఎంత చక్కటి బొమ్మలో!

కాంతం: ఇవన్నీ కొన్నారా ఏమిటి కొంపదీసి..?

ముని: (లేదన్నట్లు) ఆహాఁ...

కాంతం: ఆఁ కొనే వుంటారు. మీకు ఎవడో టోపీ వేసి వుంటాడు. ఇవేం పిచ్చి బొమ్మలండీ?

ముని: ఏం! బాగోలేవా?

కాంతం: ఏం బాగుండడం. నా ముఖం.

ముని: నీ మొఖానికేం కాంతం.

కాంతం: సరేలేండి. ఎందుకూ పనికిరానివన్నీ మీకు అంటగట్టినట్టున్నాడు ఆ తలమాసిన వాడెవడో? ఇంతకీ ఎవరండీ మిమ్మల్నిలా అన్యాయం చేసింది?

ముని: చాల్లే వూరుకో! నీకు ఆ బొమ్మల సంగతి ఏం తెలుసని మాట్లాడుతున్నావ్. ఇవన్నీ గొప్ప ప్రసిద్ధులైన చిత్రకారులు గీసిన పటాలు.

కాంతం: ఆహాఁ....

ముని: కొంటే ఒక్కొక్కటీ మూడు, నాలుగొందలకు తక్కువుండదు.

కాంతం: అంత డబ్బు తగలేసి కొన్నారా?

ముని: కొనడానికి అంతడబ్బు మన దగ్గర ఎక్కడిదే? పిచ్చిమొహమా!
మన బాపిరాజుగారు లేరూ!

కాంతం: ఆయనకీ బొమ్మల సరదా వుందిగా?

ముని: అందుకే! ఆయనవి యివన్నీను. ఆయన్ని అడిగి, బ్రతిమలాడి ససేమిరా యివ్వనంటే వేధించి యివన్నీ తెచ్చాను.

కాంతం: ఎందుకండీ ఆయన్ని అంత యిబ్బంది పెట్టడం.

ముని: నీకు చూపిద్దామనే

కాంతం: ఆహాఁ....

ముని: (అందులోంచి ఓ బొమ్మతీసి ఠీవిగా నిలబడి భార్యకి చూపిస్తూ ఆ బొమ్మ గురించి అభినయంతో కూడిన వివరణ ఇస్తూ). ఇది ప్రఫుల్లచంద్ర ముఖర్జీ అనే

ప్రఖ్యాత బెంగాలీ చిత్రకారుడు గీసిన చిత్రం. ఈ చిత్రం చూడు. ఈ స్త్రీ ఒక విరహిణి. విరహవేదనను అనుభవిస్తూ ప్రియుని ఆగమనానికై నిరీక్షిస్తోంది.

కాంతం: (భర్త ముఖంలోకి చిత్రమైన చూపు చూసి) చూశాను.

ముని: (తాదాత్మ్యంతో) పొద్దస్తమానం ఊరు మీద తిరిగి సాయంవేళ కొంపకి చేరే సరికి ప్రియురాలు యిలా భర్తకోసం నిరీక్షిస్తుంటే భర్తకు ఎంత ఆనందంగా వుంటుందో ఆలోచించు. పోనీ వూహించు.

కాంతం: మీరే వూహించుకోండి. నేను భర్తను కాదుకదా!

ముని: అదికాదే కాంతం. నేను యింటికొచ్చేసరికి నువ్వుకూడా యిలా వుండరాదే.

కాంతం: (వెటకారంగా) నేనా?

ముని: ఇదేమంత కష్టమైన పనికాదే! తెల్లచీర కట్టుకుని పూలు అర్ధచంద్రాకారంలో తలలో పెట్టుకుని ఆ వున్న ఆభరణాలు...

కాంతం: నాకున్న ఆభరణాలు...!

ముని: అవేనే! నీకున్న ఆభరణాలు గడియారం గొలుసూ, కాచికాయ గుండ్లూ మెళ్ళో వేసుకుని చక్కగా బొట్టు దిద్దుకుని కళకళలాడుతూ కనబడవే! (అంటూ బతిమాలుతున్నట్లు గెడ్డం పట్టుకుని బ్రతిమాలతాడు)

కాంతం: ఆ తర్వాత?

ముని: (అభినయిస్తూ) కనబడ్డం అంటే ఈ బొమ్మలో మాదిరిగా కనబడాలి సుమా! ఈ చిత్రం నిరీక్షణం. నీవు కూడా యిలా ముస్తాబై వయ్యారంగా ఈ పోజుతో (అని పోజుపెట్టి చూపిస్తూ) గెడ్డం కింద చెయ్యి పెట్టుకుని ఓ చాప మీద కూర్చుని మన కిటికీలోంచి చూస్తూ వుండు.

కాంతం: (వచ్చే నవ్వుని ఆపుకుంటూ) ఎవరిని చూస్తూ వుండమంటారు?
వీధిలో వచ్చిపోయే జనాన్నా?

ముని: అవే తెలివి తక్కువ మాటలు. అప్పుడు నీ చూపులు చిత్రంగా, విచిత్రంగా ఉండాలి (అభినయిస్తూ చూపిస్తాడు) దూరంగా ఎక్కడో స్వప్న లోకంలో ఉన్న ఓ దివ్య దృశ్యాన్ని గమనిస్తుండాలి. నీ కళ్ళు నిమీలితంగా ఉండాలి. ఆ కూర్చున్నప్పుడు నీ శరీరం కూడా ఈ బొమ్మలో స్త్రీ శరీరం లాగ వొంపులతో లావణ్యాన్ని వర్షిస్తూ, నిరీక్షణా భావానికి అనుగుణంగా ఉండాలి. వింటున్నావా?

కాంతం: ఆహా వింటూనే వున్నా! మీరు చెప్పిందంతా!

ముని: (మరో బొమ్మ తీసి చూపిస్తూ) ఈ బొమ్మపేరు పట్టితల్లి. మాతృత్వం మూర్తీభవించిన రూపులో, చూపులలో మాతృప్రేమ పలికిస్తూ తన బిడ్డకు పాలిస్తుంది. నువ్వుకూడా పిల్లాడికి పాలిచ్చేటప్పుడు.

కాంతం: ఊరుకోండి. పిల్లలకు పాలియ్యటం తెలియదండీ. నాకు. నా ఖర్మ కాకపోతేనూ (అని పమిట సవరించుకుంటుంది)

ముని: అలా అనికాదే! ఈ భావాన్ని కనబరుస్తూ కనబడటంలో వుంది అదంతానూ.

కాంతం: సరేలేండి. (అంటూ ఒక బొమ్మ తీసుకుని) ఇదేం బొమ్మండి? ఇందులో పిల్లలు, తల్లి ఉన్నారు.

ముని: ఇది గొప్ప చిత్రం. ప్రసిద్ధుడైన బెంగాల్ చిత్రకారుడు ఈ బొమ్మగీశాడు. ఇది "The Light of the Home" అంటే ఇంటిదీపం అని. నువ్వుకూడా మన పిల్లలతో యిలా వుంటే ఎంత బావుంటుంది. చుక్కల మధ్య చంద్రుడిలా ఎలా ప్రకాశిస్తోందో చూడు.

కాంతం: (వెటకారంగా చూసి) 5గురు పిల్లల తల్లిని ఇంకేం ప్రకాశిస్తాను.

ముని: నీకేమే పిచ్చిమొహమా! జహంగీరు చక్రవర్తి బహు సంతానవతి అయిన తన భార్యను నూర్‌మహల్ అని పిలిచాడు. ప్రయత్నిస్తే నీకేం కష్టమైన పోజు కాదిది.

కాంతం: సరేలెండి అన్నీ ఓ మోస్తరువేనా? ఇంకా ఏమైనా మంచి వున్నాయా?

ముని: అంటే యివన్నీ మంచివి కావనా నీ ఉద్దేశ్యం.

కాంతం: అందుకనే నాకు కోపమొచ్చేది. ఇవి మంచివి కావని నేనన్నానా. పోనీలే పాపమని మీరేదో ఉత్సాహంగా చెబుతూ ఉంటే శ్రద్ధగా వింటున్నందుకా ఈ మాటలు.

ముని: కాదులె కాదులే! ఈ బొమ్మ చూడు – ఇది రతీదేవి చిత్రం. ఎంత అద్భుతంగా ఉందో చూడు.

కాంతం: నాలుగు పెట్టుకుంటే నేనూ అలాగే ఉంటాను.

ముని: ఉండమనేగా నా కోరిక. ఆ చూపులలో వయ్యారం కించిత్ ఆకలి. ఆ సిగ్గు, ఆ నమ్రత, ఆ లావణ్యం ఓహ్... అద్భుతంగా ఉంది కదూ – శయ్యా మందిరంలోకి నువ్వు వచ్చినప్పుడు యిలా యిటువంటి భావాలను వ్యక్తపరిస్తే ఒక సజీవ చిత్రాన్ని చూసి ధన్యుణ్ణవుతాను కాంతం.

కాంతం: మనకి శయ్యా మందిరం ఎక్కడిదండీ!

ముని: (చిరాగ్గా) ఇవే కుంటిసాకులు కుటిల ప్రశ్నలునూ. అందమంతా ఆ చూపులలోను, భావ ప్రకటనలలోను వుందిగానీ శయ్యామందిరంలో ఉందా ఏమిటి?

కాంతం: సరేలెండి యింకా చాలా బొమ్మలున్నట్లున్నాయే!

ముని: ఈ బొమ్మలన్నీ నువ్వు జాగ్రత్తగా పరీక్షగా చూడు. మాట్లాడేటప్పుడు, పడుకున్నప్పుడు, కూర్చున్నప్పుడు ఎట్లా ఉంటే అందమో ఆ వొంపులు, హస్త విన్యాసాలు, ఆ భంగిమలు అవన్ని చూపిస్తూ ఉన్న అజంతా చిత్రాలు తెచ్చాను. ఇది చూడు నిలబడినపుడు సాధారణంగా ఇలా నిల్చుంటే అందం.

కాంతం: ఇలాగా, ఈ పిల్ల పాపం ఏదో కడుపులో నొప్పితో బాధపడుతున్నట్లుగా ఉంది కదూ.

ముని: నువ్వొట్టి పిచ్చి మొద్దువి. ఇది అద్భుతమైన పోజు. ఈ భంగిమను త్రిభంగి

అంటారు. మాట్లాడేటప్పుడు యిలా చెయ్యి ఎత్తి చూపితే ఈ హస్తాన్ని మృగశీర్షకమంటారు.

కాంతం: నాకు తెలియకడుగుతాను ఎందుకండీ ఇవన్నీనూ, మనం మామూలుగా నిలుచున్నట్లు నిలుచుంటేనేం –

ముని: అంతా విని మళ్ళీ ఇదేం ప్రశ్నే, మామూలు పద్ధతిలో అందం లేదు.

కాంతం: ఈ బొమ్మల్లోలా ఉంటే,

ముని: గొప్ప అందము, లావణ్యము ఉంటాయి.

కాంతం: ఓహో! తెలియకే అడిగాన్లెండి.

ముని: నే చెప్పినట్టు విని నన్ను సంతోషపెట్టడానికైనా ఇట్లా చెయ్యవే !

కాంతం: చేస్తాన్లేండి.

ముని: (ఆనందంతో) నువ్వలా చేస్తే నా ఇల్లు సజీవచిత్రాలతో కూడిన ఒక అద్భుత చిత్రశాల అవుతుంది నువ్వు ఈ చిత్రాలను అనుకరిస్తే.

కాంతం: అనుకరిస్తానులెండి. మీరంత సరదాపడుతున్నారు కదా అయితే ఓ కండీషనండోయ్ –

ముని: ఏమిటది?

కాంతం: ఇదంతా మీతో మాట్లాడుతున్నప్పుడుమాత్రమే. ఇంకెవరిముందు ఈ చిలిపిచేష్టలు నేను వేయను.

ముని: (ఆనందంగా) అయితే రాత్రికి నువ్వు పిల్లల్ని నిద్రపుచ్చి రతీదేవిలా అలంకరించుకొని మన శయ్యా మందిరానికి వస్తావు కదూ కాంతం.

కాంతం: (నవ్వుతూ) మీ ముచ్చట కాదనగలనా. మన శయ్యామందిరం మీరు

చదువుకున్నంతసేపు చదువుకుని నిద్రొచ్చాక పడుకునే రీడింగ్ రూమేగా నాథా! (అని నవ్వుతుంది)

-- లైట్సాఫ్ --

(కంచు చెంబుతో నీళ్ళు తీస్కుని పైన ఒక గ్లాసు బోర్లించి ముని మాణిక్యం గదిలోనికి కాంతం ప్రవేశిస్తుంది. మామూలుగానే వుంటుంది. మునిమాణిక్యం ఆమెను చూసి ఏ అలంకరణా లేకపోవడంతో నిరుత్సాహపడి.)

ముని: ఆ ముడేమిటి, తల్లో పువ్వులేవి, రతీదేవి చూపులేవి, ఆ వస్త్రధారణేది.

కాంతం: ఆగండి ఆగండి. స్త్రీ ఇలా ఉండాలి, యిలా అలంకరించుకోవాలి, ఈ భంగిమలో నిలబడాలి, యిలా చూడాలి అలా నవ్వాలి అంటూ చిత్రకారులు స్త్రీల చిత్రాలు గీశారు కదా స్త్రీ దృష్టిలో పురుషులెలా ఉండాలో గీసిన చిత్రకారులు లేరా అటువంటి చిత్రాలు లేవా?

ముని: (తెల్లబోయి) ఏమిటి నువ్వనేది!

కాంతం: ఇందులో అర్థంకానిదేముందండీ. మీరింటికి వచ్చేటప్పుడు అట్టహాసంగా రాజు వెడలె రవి తేజములరయగ అని నే అడిగానా, మీ ఫ్రెంచి కటింగ్ వద్దు చక్కటి పులిగోరు కోర మీసం పెంచండని నే కోరానా, మీ క్రాపింగు బాగోలేదు పైన జరీ తలపాగ ధరించండని అభ్యర్థించానా - -

ముని: (ఆశ్చర్యంగా చూసి) నీ కడుపులో యిన్ని కోరికలున్నాయటే !

కాంతం: ఈ కోరికలేవి నాకు లేవు. మీరు ఎలా ఉన్నా అలంకరించుకున్నా, అలంకరించు కోకపోయినా మీరు నా కంటికి మన్మథులే. అలాగే నేను అయిదుగురు పిల్లలతో ఇంటి పని చేసుకుంటూ మీకు కావల్సినవి సమకూరుస్తూ మీ కోసమే బ్రతుకుతున్న నాలో రతీదేవి మీకు కనిపించటంలేదా. మీరు నాకు ఎప్పటికి మన్మథులు. నేను మీకు ఎప్పుడూ రతీదేవినే.

ముని: (ఒక విధమైన ఉద్వేగంతో కాంతాన్ని దగ్గరికి తీసుకోబోతాడు)

కాంతం: (కొంటెగా) ఆగండాగండి. ఉన్నంతలో అలంకరించుకుని అద్దంలో చూసుకుని బొట్టు దిద్దుకొని సిగలో మల్లెచెండు ముడుచుకుని వస్తాను మీా రతీదేవిలా.

గ్యారా కద్దు - బారా కొత్వాల్

(కథ)



రచన: శ్రీ సురవరం ప్రతాపరెడ్డి


నాటకీకరణ: ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి దర్శకత్వం: శ్రీ దీక్షిత్ డి.ఎస్

నటీనటులు:


వెంకయ్య	-	శ్రీ తేజోమూర్తుల మురళీధర్
కరణం	-	శ్రీ 'సై' షానీ (అన్ని ప్రదర్శనలకు)
సంగీత సహకారం	-	శ్రీ వి. వేణుగోపాలాచారి
సమన్వయ సహకారం	-	శ్రీ శ్రీధర్ దీక్షిత్, శ్రీ కోలా శ్రీనివాస్, శ్రీ వి. ధనరాజ్
కర్టెన్స్, లైటింగ్, సౌండ్స్	-	శ్రీ సురభి శ్రీకృష్ణదేవరాయలు

60

' గ్యారా కద్దు - బారా కొత్వాల్ ' దృశ్యాలు



శ్రీ తేజోమూర్తుల మురళీధర్



(ఎడమ నుంచి) శ్రీ 'సై' షానీ, శ్రీ తేజోమూర్తుల మురళీధర్

' గ్యారాకద్దు - బారా కొత్వాల్ '

(వెంకయ్య నెత్తిమీద తట్ట బోర్లించుకుని ఏడుస్తూ మొరపెట్టుకుంటూ కూర్చుంటాడు. స్టేజి మీద – కాసేపటికి కరణం పాత్ర ప్రవేశించి వెంకయ్య నెత్తి మీద తట్టను తీసి వాడి పరిస్థితి చూసి)

కరణం: ఏమైంది బిడ్డా ఎందుకేడుత్తున్నావ్...

(వెంకయ్య సమాధానం చెప్పకుండా బిగ్గరగా ఏడుస్తాడు)

కరణం: అరె ఏమైంది బిడ్డా నాతో చెప్పు. నిన్నెవరేమన్నారు వాని పని పడతా, తోడకలు తీస్తా...

వెంకయ్య: (తన మొర వినేవాడు దొరికాడని ఆనందంగా లేచి)... ఏం పొయ్యేకాల మొచ్చిందయ్యా నా యింటి మునగల సొరపాదుకు పన్నెండు సొరకాయలు కాసినయి. ఆటిని గీ ప్యాట స్థలంల అమ్ముకుని పిల్లలకింత గంజిగట్క తాపుదమని, గింత అంగిబట్ట కొంచపోదమని వస్తే ఆ మాలీ పటేల తలారోడొచ్చి (అభినయిస్తూ) 'గీడ కూసోమని హుకుమత్ ఎవడిచ్చిందుబే, ఎవన్నడిగి కూసున్నవ్. తే రెండు సొరకాయలు,

నాకొకటి, పటేలకొకటి, అని రొండు సొరకాయలు కొంచబాయె, పోలీసు పటేల్ తలారోడొచ్చి ఇంకొక సొరకాయ కొంచబాయె. పెద్ద తలారోడొచ్చి "మొన్నటి దినం నీ అసంటోడె వచ్చి కొమటోనిల్లు కన్నమేసి దోచిండు నీవు కూడ అందుకే వచ్చినట్లున్నవ్ రా కొడుకా" అన్నడు. 'అయ్యా మారాజా! నేను దొంగను కాను, హమేషా ఈ ప్యాటకొచ్చి పోయేటోడ్ని కరెంగ సెబుతున్న నా మాట యినుకో' మన్నా... ఇన్లే.. ఇంకొక సొరకాయ కొంచబోయె. గీతీర్న పూజారోడు, కమ్మరోడు, వడ్లోడు అందరాయగాండ్లు తమ వంతుదని సెప్పి సొరకాయలన్ని కొంచబోయిరి.

కరణం: అన్ని సొరకాయలు గుంజ్కపోయిరా? మరి నాకేదిరా సొరకాయ. అందరివంతు సొరకాయలిచ్చి నావంతు తప్పించినావ్‌రా?

వెంకయ్య: అయ్యా! నువ్వు నారాయణమూర్తివి. నన్నెట్లన్న ఈ ఆపతకెల్లి గట్టెక్కియండ్రి. పేదోన్ని, పిల్లలున్నోణ్ణి, మీ కాలుమొక్కుతా – బాంచన్ దయ చూడుండి.

కరణం : అరె లుచ్ఛా, లఫంగా నావంతు సొరకాయతెచ్చి గీ గొంగడి బట్ట తీస్కపో (అని పై మీదున్న గొంగడి లాక్కుని కాలితో తన్ని పోతాడు).

వెంకయ్య : (ఏడుస్తూ) మంచి మారాజె వచ్చిండని ముచ్చటంత జెప్పిన కనికరం లేని కరణమోడు. కాలితో తన్ని గొంగడి బట్టకూడ కొంచబోయిండు. అరె. నేనేం తప్పుజేసిన నాయింటి మునగల కాసిన సొరకాయలమ్ముకుందమని వస్తే అందరూ లూటీ జేసిన్రు. నాగంజిల మన్ను బోసిన్రు. ఇంకొంత పొద్దుగనమీదుంటె నా గోసికూడ కొంచబోయె టట్టున్నరు (అని బెదురుతూ గోసిని చేత్తో పట్టుకుంటాడు). థూఁ గిదేం బత్కు. బతికితే పటేలోని లాగనో, పట్వారోనిలాగనో బతకాలె. కమ్‌సెకమ్ తలారోని లాగన్న బతకాలె – గీ బత్కు బతికిన ఒకటె. బొందలబడిన ఒకటె. పస్కొండు సొరకాయలూ పాయె, గొంగడి బట్టాపాయె. ఆఁ.... "జిస్‌కాలాటీ ఉస్‌కా భైంస్" అన్నదే నడుస్తున్నది దునియల. గందుకే నేను కూడా సిన్నదో, పెద్దదో లాటీ తీస్కుంట. అందర్నీ లూటీ జేస్త.నివద్దిగ బతికేటోని బతుకుల మన్నె. ఈ పటేలోడు, పట్వారోడు నన్ను చూసి

పరేషాన్ గావాల. ఈ ఎంకడంటే ఏందో అందరికీ ఎర్క గావాల. దునియపోంట పోత. దేవునికైన, దేవరకైన దెబ్బే గురువు. ఏసంటోనికి అసొంటి సుర్కు పెట్టకుంటే నా పేరు ఎంకడే గాదు. "జిస్‌కాలాటీ, ఉస్‌కా భైంస్" . . . . . .

(లైట్స్ ఆఫ్)

దృశ్యం - 2

(షేర్వాణీ, నెత్తిమీద టోపీ, చేతిలో లాటీతో ప్రవేశిస్తాడు. మర్రిమానుచెట్టు - పక్కన దివుడుబావి - చెట్టుకింద నాలుగు కుర్చీలు - ఒక కుర్చీలో వెంకయ్య - చుట్టూ నలుగురు మనుషులు)

వెంకయ్య : "జిస్‌కాలాటీ ఉస్‌కా భైంస్" కర్రున్నోనిదే బర్రె. లాటీ ఉన్నోడో లూటీ... చేస్తడు... చేసినా ఎవ్వడడగడు వాని చేతిల లాటీ చూసి. నాకీ సుద్ది మంచిగనే సమజయినంక వేరొకడు నాకు లాటీ యిచ్చుడేందని నాలాటీ నేనే సుదురాయించుకున్న. పెళ్ళం ఒంకి అమ్మి వచ్చిన పైసలతో ఏషం వేసిన, షేర్వాణి తొడిగిన, నెత్తిన టోపీ పెట్టిన, సేతిల లాటీ పట్టిన. నల్లదున్నపోతుల్లాంటి నలుగురు అరబ్బు జవానోళ్ళను నాకింద కొల్వుకు పెట్టిన. మాంచి ప్యాట స్థలం జేరిన, నాలుగు రస్తలున్న చోటు పక్కన మర్రిమాను చెట్టుండె. దాని ప్రక్కన మంచినీళ్ళ బావుండె, మంచి తావె ఉన్నదని మంచిగ కుర్సీయేసి కచేరిలాగసేసి కూర్చున్న. బావికాడకొచ్చేటోళ్ళదగ్గర కడవకు పైస యిచ్చి నీళ్ళు తీస్కపోండి అని చెప్పిన. నా వేషం చూసి, నాజవాన్లను చూసి అందరూ పైసలిచ్చినంకనే నీళ్ళు తీస్కపోబట్టి. పటేలోడొచ్చే, సర్కారు హుకుముందని ఉర్దూల రాయించినా కాయితం చూపించిన. సదువు, సందెరాని పటేలోడు నిజమేనని నమ్మిండు. ఉడాయించినాడు. పటేలు నమ్మబట్టి ఊర్ల అందరూ నమ్మబట్టి. నా యేషం చూసి, నా అరబ్బోళ్ళను చూసి ఒక్కడన్న కిక్కురుమంటె ఒట్టు. అందరు పైసలు దఖలు చేసినంకనె నీళ్ళు కొంచబోతుండ్రి.

"మ(క్రిమాన్ ఫర్గణా, సుంకం ఫర్మానా" చుట్టూ నాలుగామడదూరం పోయింది. ఎంకడంటె అందరికీ ఎర్కయ్యింది. "ఒంకి" ఇచ్చిన నా పెళ్ళానికి వొడ్డాణం చేయిస్తి. పెయినిండ సొమ్ములేనాయె. ఎకరం పొలమున్న ఎంకడిప్పుడు నాలుగ్గాండ్ల సేద్య మాయె. వచ్చెటోడు, పోయెటోడు సలామ్‌లు చెయ్యబట్రి. దొరా అని పిలువబట్రి. అంతా లాటీ మైమ. ఆఖరికి సుబేదారు, దివాను అసంటోళ్ళు కూడా, పైసలిచ్చినంకనే నీళ్ళు కొంచబోయి నంక ఎవడికైనా సర్కారు ఫర్మానా చూడాలన్న దమాకుందా. దమాకు లేనోళ్ళు ధైర్యం లేనోళ్ళు. ధైర్యంతోన హుకుమత్ చెలాయిస్తే బస్ అదే నడుపకబోతది. "కర్రున్నోనిదే బర్రె" అన్న సుద్ది ఎంకడి కెరికయినంతగా ఎవ్వరికీ ఎర్కగాలె. ఎవ్వడు ముంగలికిరాడు లాటీ ఉంటె. దునియ అంత నాదె.

మొన్నేమైంది. నిజాం నవాబోడె గీ బాటెమ్మట పటాలంతో బోతుంటె. నీళ్ళకోసం మనుషులను పంపితే, నాకు తెల్వక పైసలు దఖలు చేసినంకనే నీళ్ళు కొంచబోవాలని చెప్పిన, "దివాన్ జీ ఖజానా భర్తి చేసేటందుకు ఈ హుకుమత్ ఇచ్చి ఉంటడని" అనుకున్నడేమో పైసలు దఖలు చేసినంకనే నీళ్ళు తీస్కపోయిండు. అరె పట్నం పోయినంక దివాన్‌జీ తోన గీ ముచ్చట తీస్తె "హుకుమత్" ఉత్తదేనని తేల్తదేమో! ఇయ్యాలో రేపో నన్ను బులావ్‌మని పట్కబోతరేమో? ఏంజెయ్యాల సమజయితలేదు (అని ఆలోచిస్తూ తిరుగు తుంటాడు). ఏమి చేసుడేంది. పళ్ళెంలోన ఎయ్యి ఇష్రాపులు పెట్టి యిస్తా. నేను జెయ్యబట్టి గీ పైసలు నీకొచ్చినయ్ అని సెప్తా. పైసలు చూసినంక సర్కారోడి కండ్లు సల్లబడకుండ ఉంటాయా? హుజూరైనా నజరానా కండ్ల బడాల. ఎంకడికి దునియంత ఎరికనె. పైసలోన పరమాత్మ ఉన్నంక సర్కారోడేంది. ఆడి యబ్బయిన దిగి వస్తడు. ఇగ నేను బోత పటాలం వస్తున్నట్లున్నది నన్ను పట్కపోయేతందుకు (అని నిష్క్రమిస్తాడు).

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణలు

1. ఆంధ్ర మహాభారతోపన్యాసములు .... రూ.100/-
2. తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం........ రూ. 70/-
3. తెనుగు సాహితి .... రూ. 36/-
4. స్త్రీల రామాయణపు పాటలు .... రూ. 36/-
5. సమీక్షణం .... రూ. 36/-
6. పరిణతవాణి- 1, 2, 3 సంపుటాలు .... రూ. 131/-
7. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు .... రూ. 70/-
8. ఇరివెంటి వ్యాసాలు.. రూ. 30/-
9. శాలివాహన గాథా సప్తశతీసారము .... రూ. 15/-
10. రాయప్రోలు రచనలు - తత్త్వవివేచన .... రూ.60/-
11. తెలుగులో సాహిత్యోద్ధారకులు .... రూ.40/-
12. మల్లికా గుచ్ఛము .... రూ. 8/-
13. మనజాతి నిర్మాతలు .... రూ. 4/-
14. సుమతి, వేమన, కృష్ణశతకాలు .... రూ. 24/-
15. ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక .... రూ. 250/-
16. తెలంగాణాలో జాతీయోద్యమాలు .... రూ. 10/-
17. సంస్కృత పాఠవల్లరి.. రూ. 4/-
18. నా సాహిత్యోపన్యాసములు .... రూ. 5/-
19. గౌతమబుద్ధుడు-జవహర్లాల్ నెహ్రూ .... రూ. 3=60
20. కర్నల్ కాలిన్ మెకంజీ.. రూ. 1=50
21. మనదేశం - తెలుగుసీమ .... రూ. 7/-
22. మననదులు - కృష్ణాగోదావరులు .... రూ. 3/-
23. మధురభక్తి - ముగ్ధభక్తి .... రూ. 80/-
24. ప్రాచీన కవిత .... రూ. 10/-
25. ప్రసంగ వ్యాసాలు .... రూ. 5/-
26. ఆంధ్ర సారస్వత పరిషత్తు చరిత్ర (1943 - 1992).. రూ. 10/-
27. దశరూపక సారం .... రూ. 5/-
28. భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం .... రూ. 2/-
29. నా రేడియో ప్రసంగాలు .... రూ. 5/-
30. సాహిత్యానువాదం: సమాలోచనం .... రూ. 60/-
31. డా. దేవులపల్లి రామానుజరావు అభినందన సంచిక .... రూ. 20/-
32. తెలుగు రచన .... రూ. 7/-

అడ్వాన్సుతోపాటు ప్రతులకు వ్రాయండి:
ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాదు-500 001. ఫోన్: 24753724